


ముగిసిన దసరా ఉత్సవాలు

ఈ నెల 3న ప్రారంభమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు శమీ వృక్ష పూజలతో శనివారం రాత్రి ముగిశాయి. తొమ్మిది రోజులు వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు పదో రోజైన శనివారం శాంతమూర్తి అవతారమైన రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. దేవతామూర్తులకు ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. జిల్లావాసులు విజయదశమి పర్వదినాన్ని వైభవంగా జరుపుకున్నారు. వేకువజామునుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయాలు కిటకిట లాడాయి. అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి.

- బాపట్ల



బాపట్ల ఎస్పీ కార్యాలయంలో అమ్మవారి విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన ఆయుధాలు



అమృతలూరులో అమ్మవారికి ప్రత్యేక అలంకారం



చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయంలో లలితా త్రిపురసుందరీదేవిగా దుర్గమ్మ

- రేపల్లె



కన్యకా పరమేశ్వరదేవాలయంలో బాలత్రిపురసుందరీదేవిగా కన్యకాపరమేశ్వరి



మరో రెండు రైలు మార్గాలు

- కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం
- సర్వేల దశలో ఉన్న రెండు రైల్వే ప్రాజెక్టులు
- ఇవి ఏర్పాటైతే ఉమ్మడి గుంటూరు జిల్లాకు నలువైపులా కనెక్టివిటీ
- రైల్వే మంత్రి వైష్ణవ్‌తో ఇటీవల సీఎం చంద్రబాబు సమావేశంలో చర్చ

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాకు మరో రెండు కొత్త రైలు మార్గాలు మంజూరు కానున్నాయి. ఇప్పటికే ప్రిలిమి నరీ-కమ్-ట్రాఫిక్, ఫైనల్ లోకేషన్ సర్వేలు పూర్తి చేసుకున్నాయి. అయితే ఈ ప్రాజెక్టులు గత కొన్నేళ్ల నుంచి రైల్వే శాఖ అటకెక్కించింది. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాలు అధికారంలో ఉండటం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ, జనసేన ఎంపీలపై కేంద్ర ప్రభుత్వం ఆధార పడటంతో అటకెక్కించిన ఆ ప్రాజెక్టులను చేపట్టేందుకు రైల్వే శాఖ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబునాయుడు జరిపిన సమావేశంలోనూ ఈ రెండు ప్రాజెక్టులపై చర్చ జరగడం సానుకూల వాతావరణాన్ని ఏర్పరుస్తున్నది. సాధ్యమైనంత త్వరగా వీటిని రైల్వే కేటాయింపులు (పింక్‌బుక్)లో చేర్చి నిధులు మంజూరు చేస్తే మూడు, నాలుగేళ్లలో ప్రాజెక్టులు పూర్తి అయ్యే అవకాశం ఉన్నది.

మచిలీపట్నం - రేపల్లె - బాపట్ల

మచిలీపట్నం-రేపల్లె నూతన రైలుమార్గం నిర్మాణం చేయాలన్నది దశాబ్ధాలుగా తీర ప్రాంతాల ప్రజల ఆకాంక్ష. ఈ రెండు పట్టణాల మధ్య కేవలం 45.30 కిలోమీటర్ల దూరం ఉన్నది. రైలుమార్గంతో కలిపితే పలు రైళ్లని చుట్టూ తిరిగి విజయవాడ వైపునకు వెళ్లకుండా రేపల్లె-తెనాలి మీదగా మళ్లించొచ్చు. పైగా చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రముఖ నగరాలకు ప్రయాణ దూరం కూడా తగ్గుతుంది. అయితే ఈ మార్గంలో క్లిష్టమైన కృష్ణా నదిపై మూడు కిలోమీటర్ల దూరం పైగా వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకు కారణం ఇక్కడ కృష్ణానది వెడల్పు పాయలు గా విడిపోయి ఎక్కువగా ఉంటుంది. అయినా ఎట్టకేలకు గత ఆగస్టు నెల 20న ఫైనల్ లోకేషన్ సర్వేని రైల్వేశాఖ మంజూరు చేసింది. ఈ సర్వే పూర్తి అయితే రైలు మార్గం నిర్మాణం చేపట్టడానికి వీలు కలుగుతుంది. రేపల్లె - బాపట్ల నూతన రైలుమార్గం ప్రిలిమినరీ ఇంజనీరింగ్- కమ్- ట్రాఫిక్ సర్వే కూడా మంజూరైంది. దీనిని నిజాంపట్నం పోర్టు మీదగా సర్వే చేసి రిపోర్టు కూడా పంపించారు. రూ.792.33 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. రేట్ ఆఫ్ రిటర్న్స్ చూసుకుంటే -8.72 శాతంగా రావడంతో రైల్వే శాఖ 2017లోనే దీనిని అటకెక్కించింది. ఇప్పుడు సరుకు రవాణాకు సదుపాయాలను పెంచుతుండటంతో ఈ ప్రాజెక్టుని చేపట్టేందుకు రైల్వే మంత్రి అంగీకరించినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు.

తెనాలి - రేపల్లె మధ్య డబ్లింగ్..

తెనాలి-రేపల్లె మధ్యన డబ్లింగ్, విద్యుద్ధీకరణ ప్రాజెక్టుకు సంబంధించి ప్రిలిమినరీ ఇంజనీరింగ్ కమ్ ట్రాఫిక్ సర్వే 2015 లోనే పూర్తి అయింది. దీనికోసం రూ.259.91కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే రేట్ ఆఫ్ రిటర్న్స్ -25.35 శాతంగా ఉండటంతో రైల్వేశాఖ పక్కన పెట్టేసింది. దీనిని కూడా ఇప్పుడు చేపట్టేందుకు రైల్వేశాఖ అంగీకారం తెలిపింది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాకు రెండు కొత్త రైలు మార్గాలతో పాటు ఒక డబ్లింగ్ రాబోతున్నది.

లక్కెవరికో?

- దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ
- మద్యం షాపులకు నేడు లాటరీ
- ఉదయం 7 నుంచి ప్రక్రియ ప్రారంభం
- బాపట్లలో 117 షాపులకు 2149 దరఖాస్తులు
- పల్నాడు జిల్లాలో 129 దుకాణాలకు 2639..
- గుంటూరులో 127 షాపులకు 4448 దరఖాస్తులు

బాపట్ల, నరసరావుపేట(ఆంధ్రజ్యోతి), గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 13: ఇప్పటివరకు మద్యం విక్రయాలను ప్రభుత్వం చేపట్టగా ఆ స్థానంలో వ్యాపారులు రానున్నారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో మద్యం వ్యాపారంపై ఆసక్తి ఉన్న వారి నుంచి ప్రభుత్వం దుకాణాల వారీగా దరఖాస్తులను స్వీకరించింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో దుకాణాలకు పలువురు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నెల 1 నుంచి ప్రారంభమైన ఈ దరఖాస్తుల ప్రక్రియ సోమవారం జరగనున్న లాటరీ అంకంతో ఓ కొలిక్కి రానుంది. సిండికేట్ మంతనాలు.. స్థానికేతరుల అంశంలో బెదిరింపులు.. ఇలా ఎన్నో ప్రతిబంధకాల మధ్య పది రోజులకు పైగా దరఖాస్తుల ప్రక్రియ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సాగింది. శుక్రవారం రాత్రితో దరఖాస్తుల అంకం ముగియగా శని, ఆదివారాల్లో పరిశీలనలు జరిగాయి. ఆయా దరఖాస్తుల లాటరీ సోమవారం జిల్లా కేంద్రాల్లో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే అదృష్టం ఎవరిని వరిస్తోందోనని రూ.2 లక్షలు ఫీజు కట్టి దుకాణాలకు దరఖాస్తులు చేసుకున్న వారిలో ఉత్కంఠ నెలకొంది. దరఖాస్తుదారులు ఉదయం 7 గంటలకే లాటరీ తీసే కేంద్రాలకు రావాలని 8 గంటల నుంచి ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. దరఖాస్తుదారులు మాత్రమే రావాలని బయటవారెవరికీ దానిలోకి ప్రవేశం లేదని అధికారులు తెలిపారు. మొత్తం ప్రక్రియ కలెక్టర్, జేసీల సమక్షంలో జరుగుతుందని,



ప్రసంగిస్తున్న గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు, పక్కన ఏసీ రవికుమార్ రెడ్డి, ఈఎస్ అరుణకుమారి

వీడియోగ్రఫీ కూడా తీస్తామని చెప్పారు. లాటరీలో షాపు దక్కించుకున్న వారికి 15న లైసెన్సులు అందిస్తామన్నారు. లాటరీలో అదృష్టం వరించిన వ్యాపారి రెండు రోజుల్లో షాపు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు తెలిపారు. 16 నుంచి ప్రైవేట్ మద్యం షాపులు ప్రారంభం కానున్నాయి. లాటరీ తీసే కేంద్రాల వద్ద ప్రత్యేకంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. లాటరీ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ చర్యలు చేపట్టారు. బాపట్ల జిల్లాలోని 117 షాపులకు 2149 దరఖాస్తులు వచ్చాయి. సగటున ఒక్కో షాపునకు 18 దరఖాస్తులు వచ్చినట్లైంది. గుంటూరు జిల్లాలోని 127 షాపులకు అత్యధికంగా 4448 దరఖాస్తులు వచ్చాయి. సగటున ఒక్కో షాపునకు 35 దరరఖాస్తులు వచ్చినట్లైంది. పల్నాడు జిల్లాలో మొత్తం 129 షాపులకు 2,639 దరఖాస్తులు దాఖలు కాగా సగటున ఒక్కో షాపునకు 20 దరఖాస్తులు వచ్చినట్లైంది. మద్యం షాపుల కేటాయింపులో నెలకొన్న ఉత్కంఠకు మరి కొద్ది గంటల్లో తెరపడనున్నది. పల్నాడు ప్రాంతంలో ఒక్కో వ్యాపారి పది షాపుల వరకు దరఖాస్తులు దాఖలు చేశారు. కొందరు వ్యాపారులు గ్రూపుగా ఏర్పడి దరఖాస్తులు వేశారు. ఏ షాపు ఎవరికి దక్కుతుందోన్న ఉత్కంఠ దరఖాస్తుదారుల్లో నెలకొంది.

- బాపట్ల జమ్ములపాలెం రోడ్డులోని ఎమ్మెస్సార్ కల్యాణ మండపంలో లాటరీ ప్రక్రియ సోమవారం జరగనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్తు తెలిపారు. స్టేషన్ల వారీగా లాటరీ తీయడం జరుగుతుందని, ఇందుకు 2 కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. కల్యాణమండపం వద్ద 120 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశారు.
- నరసరావుపేట ప్రకాష్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో మద్యం షాపుల లాటరీ తీయనున్నారు. లాటరీ నిర్వహణ ఏర్పాట్లను ఎక్సైజ్ ఈఎస్ మణికంఠ పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు లాటరీ తీయనున్నారు.
- గుంటూరు జిల్లాకు సంబంధించి గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో లాటరీ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు గుంటూరు ఎక్సైజ్ డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు కౌంటర్ల ద్వారా లాటరీ నిర్వహిస్తామన్నారు. ఒక కౌంటర్‌కు కలెక్టర్, మరో కౌంటర్‌కు జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ప్రక్రియ జరుగుతుందన్నారు. సమావేశంలో ఏసీ రవికుమార్‌రెడ్డి, గుంటూరు ఈఎస్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



బాపట్ల: ఎమ్మెస్సార్ కల్యాణమండపం వద్ద లాటరీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

విజేతలు వెంటనే ఫీజు చెల్లించాలి..

దుకాణాలకు వచ్చిన దరఖాస్తుల నుంచి లాటరీ తీసి లైసెన్సు పొందిన వారి పేర్లను అధికారులు ప్రకటించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. లాటరీతో పాటు లైసెన్సుల జారీ చేసే ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని ఎక్సైజ్ శాఖ చెబుతోంది. లైసెన్సులు జారీకి షాపుల వారీగా వచ్చిన దరఖాస్తులను లాటరీ తీసి విజేతను ఎంపిక చేస్తారు. దీనితో పాటు మరో ఇద్దరిని రిజర్వుగా ఎంపిక చేయనున్నారని తెలిసింది. లాటరీలో లైసెన్సు దక్కించుకున్న వారు వెంటనే నిర్దేశిత మొత్తాన్ని ఎక్సైజ్ శాఖకు చెల్లించాలి. ఇలా సకాలంలో ఎవరైనా నగదు చెల్లించకపోవడంతో పాటు ఏదైనా అత్యవసర కారణాల వల్ల లాటరీలో షాపు వరించిన వ్యక్తి పక్కకు తప్పుకుంటే నిబంధనల ప్రకారం రిజర్వులో ఉన్న తొలి వ్యక్తికి అవకాశం కల్పించనున్నారు. బ్యాంకర్లను కూడా ఆయా వేదికల వద్దే ఏర్పాటు చేశారు. లాటరీలో గెలుపొందిన వ్యక్తి షాపు దరావత్ ఫీజులో 1/6 వంతు అప్పటికప్పుడు అక్కడే చెల్లించే విధంగా సౌకర్యం కల్పించామన్నారు.

లైసెన్సును మార్చడానికి వీల్లేదు

తెరవెనక బేరసారాలతో లాటరీలో విజేత నుంచి లైసెన్సును పొందడం సాంకేతికంగా చెల్లదని ఎక్సైజ్ శాఖ చెబుతోంది. ఒక వేళ ఏదైనా సహేతుక కారణాలతో లైసెన్సును వేరే వారిపేరు మీదకు మార్చాలనుకున్నా అది జీపీఏ రూపంలోనే వర్తిస్తుందని దానికి కూడా దరఖాస్తుదారుడు లక్షల్లోనే అదనపు రుసుం చెల్లించాల్సి వస్తుందని అధికారులు తెలిపారు. లాటరీ, దుకాణం ఏర్పాటు ప్రక్రియ మార్గదర్శకాలకు అనుగుణంగానే జరుగుతుందని ఎలాంటి అవకతవకలకు ఆస్కారం ఉండదన్నారు. లాటరీలో విజేతలుగా నిలిచినవారు మాత్రమే షాపు పెట్టుకోవడానికి అర్హులని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

బేరసారాలకు రంగం సిద్ధం..

మద్యం వ్యాపారాన్ని చేజిక్కించుకునేందుకు దుకాణాల దరఖాస్తుల ప్రక్రియలో పాలకపార్టీ నేతలు జోక్యం చేసుకున్నారు. దీంతో చాలాదగ్గర్ల దరఖాస్తులు వేసేందుకు వ్యాపారులు వెనుకంజ వేశారు. ఈ పరిస్థితుల్లో నేతల తీరుపై టీడీపీ అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో సిండికేట్ ప్రతిపాదనల నుంచి నేతలు వైదొలిగారు. దాని ఫలితమే గడువు పొడిగించిన చివరి రెండు రోజుల్లో దరఖాస్తుల సంఖ్య పెరిగింది. అయితే ఆయా నేతల కన్ను ప్రస్తుతం లాటరీలో షాపు దక్కించుకునే వారిపై పడినట్లు తెలిసింది. బాపట్ల జిల్లాలో నేతల దృష్టంతా లైసెన్సుల దక్కేవారిపై ఉన్నట్లు సమాచారం. లైసెన్సును టోకుగా కైవశం చేసుకోవడమో లేదంటే తాము సూచించిన వ్యక్తులను భాగస్వాములుగా చేర్చుకునే విధంగా విజేతలతో మంతనాలు జరపడానికి జిల్లాలో నేతలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

పల్లెల్లో అభివృద్ధి పండుగ

- నేటి నుంచి 20 వరకు వారోత్సవాలు
- ప్రతీ గ్రామంలో వివిధ పనులకు శంకుస్థాపనలు
- బాపట్ల జిల్లాలో 600 పనులకు రూ.72 కోట్లతో శ్రీకారం
- పల్నాడు జిల్లాలో 9,397 పనులు.. వ్యయం రూ.286.15 కోట్లు
- గుంటూరు జిల్లాలో 166 పనులకు రూ.14.35 కోట్ల మంజూరు

బాపట్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యం.. నిధుల లేమి.. కేంద్రం నిధుల దారిమళ్లింపు.. సచివాలయాలతో ఉత్సవ విగ్రహాలుగా మారిన పంచాయతీలు.. మొత్తం మీద వైసీపీ పాలనలో పల్లెలు అభివృద్ధి లేక కుంటుపడిపోయాయి. ఈ పరిస్థితుల్లో పంచాయతీలను పురోగమన బాట పట్టించడానికి కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులేస్తోంది. పంచాయతీలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా ఆగస్టులో ఒకేరోజు గ్రామసభల నిర్వహణ.. సమస్యలపై వినతుల స్వీకరణ.. అభివృద్ధి పనులపై తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమానికి కొనసాగింపుగా సోమవారం నుంచి వారం రోజులు పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ పండుగ వారోత్సవాల్లో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేయనున్నారు. పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల నిర్వహణకు గ్రామాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి 20వ తేదీ వరకు ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం రోజుకు 15 గ్రామాలకు తగ్గకుండా అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు ప్రణాళికలు రూపొందించారు. రోడ్లు, మురుగుకాల్వలు, తాగునీరు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించనున్నారు. 15వ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ పథకం కింద పల్లెలో ప్రగతి పనులకు సోమవారం నుంచి శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనులను గుర్తించి అంచనాలను కూడా అధికారులు రూపొందించారు. గ్రామాల వారీగా మొత్తం 46 రకాల పనులకు ఆమోదం తీసుకున్నారు. ఆయా పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేస్తామని అధికారవర్గాలు తెలిపాయి. ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణ నిమిత్తం ఆగస్టు 23న జరిగిన గ్రామసభల్లో ప్రజాభిప్రాయం మేరకు తీర్మానాలు కూడా చేశారు.

- గుంటూరు జిల్లాలోని 166 గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.14.35 కోట్లను ప్రభుత్వం విడుదల చేయనుంది. తొలి రోజున మంగళగిరి నియోజకవర్గంలో గొడవర్రు, పెదకొండూరు, వీర్లపాలెం, పొన్నూరు నియోజకవర్గంలో మాచవరం, ములుకుదురు, నండూరు, శేకూరు, వీరనాయకునిపాలెం, ప్రత్తిపాడు నియోజకవర్గంలో జొన్నలగడ్డ, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గంలో దామరపల్లి, కంతేరు, ఫణిదరం, పొన్నెకల్లు, తెనాలిలోని అంగలకుదురు, చావావారిపాలెం గ్రామాల్లో జరగనున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు స్థానిక ఎమ్మెల్యేలు హాజరౌతారని డ్వామా అధికారులు తెలిపారు.
- బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న 458 పంచాయతీల పరిధిలో 600 పనులకు రూ.72కోట్ల వ్యయం చేయనున్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో సంతమాగులూరు మండలం ఏల్చూరులో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొననున్నారు. చుండూరు మండలం యడ్లపల్లిలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పలు పనులకు భూమి పూజ చేయనున్నారు
- పల్నాడు జిల్లాలో రూ.286.15 కోట్లతో 9,397 పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.



దుష్టశిక్షణ.. శిష్టరక్షణకు కట్టుబడాలి

- దసరా ఆయుధ పూజలో ఎస్పీ తుషార్‌డూడీ



పోలీసు కార్యాలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల, అక్టోబరు 13: దుష్ట శిక్షణ.. శిష్టరక్షణకు కట్టుబడి ఉండాలని పోలీసులకు ఎస్పీ తుషార్‌డూడీ సూచించారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలోని ఏఆర్ విభాగంలో శనివారం జరిగిన ఆయుధ పూజలో ఎస్పీ పాల్గొన్నారు. అమ్మవారి విగ్రహం వద్ద ఆయుధాలు ఉంచి శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. పోలీసు వాహనాలకు కూడా పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా వ్యవహరించాలన్నారు. విజయాలకు చిహ్నామైన విజయదశమి అందరికీ సుఖసంతోషాలు కలిగించాలని ఎస్పీ ఆకాంక్షించారు. అన్ని విషయాలలో విజయవంతంగా ముందుకు సాగుతూ పోలీసుశాఖ ప్రతిష్ఠను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎస్.చంద్రమోహన్, ఎస్‌బీ సీఐ జి.నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, సీసీ హరికృష్ణ, పట్టణ, రూరల్ సీఐలు, అధికారులు పాల్గొన్నారు.



రైళ్లు కిటకిట

- దసరా సెలవులు ముగియడంతో వేల మంది తిరుగు ప్రయాణం
- టిక్కెట్‌లు కన్‌ఫర్మ్ కాక ఫుట్‌బోర్డు వద్ద వేలాడుతూ జర్నీ



7లో..

దిక్సూచి DIKSUCHI

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

పర్యావరణం - అధ్యయనం

పర్యావరణం-అధ్యయనానికి సంబంధించి గతంలో వాతావరణం, పర్యావరణాల్లోని పలు విషయాలను తెలుసుకున్నాం. ఇప్పుడు వివిధ ఆవరణాల వివరాలను తెలుసుకుందాం.

జలావరణం

ఈ ఆవరణాన్ని ఆంగ్లభాషలో హైడ్రోస్పియర్ అని అంటారు. గ్రీకుభాషలో హర్యాడర్ అనగా జలం అని అర్థం. 'భూమిపై ఉన్న జల వనరులన్నీ అనగా సముద్రాలు, నదులు, జలాశయాలు, కుంటలు, సరస్సులు వాటన్నింటినీ కలిపి జలావరణం అంటారు. హైడ్రోజన్, ఆక్సిజన్ వాయువుల కలయిక వల్ల హెచ్‌టూ2(జలము) ఏర్పడుతుంది.

- భూ ఉపరితలంపై 71% అనగా 2/3వ వంతు జలభాగం ఆవరించింది. దీనిలో 1) సముద్రాల్లోని ఉప్పునీటి శాతం 97.3% 2) మంచినీటి శాతం 2.7%
- ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతంలో ఘనస్థితిలో ఉన్న మంచినీటి శాతం 2.14%
- చెరువులు, కుంటలు, సరస్సులో ఉన్న ద్రవస్థితిలో ఉన్న మంచినీటి శాతం 0.0009%
- నదులు, చెరువులు, కాలువల్లో ఉన్న మంచినీటి శాతం 0.0001%
- వాతావరణంలోని తేమ రూపంలో ఉన్న మంచినీటి శాతం 0.0001%
- భూగర్భంలో ఉన్న మంచినీటి శాతం 0.61%
- జల సంబంధిత చక్రం కీలకపాత్ర వహిస్తూ జీవులకు ఆధారమైన నీటిని సమకూర్చడంలో ముఖ్యపాత్ర వహిస్తుంది.

శిలావరణం

భూమిలో ఘనీభవించిన పొర, లేదా గట్టిగా ఉండే పైపొర ఇది. దీనిలో రాళ్లు, ఖనిజ లవణాలు ఉండి మందపాటి మట్టి పొర ఉంటుంది. గ్రీకుభాషలో లిథోస్ అనగా శిల అని అర్థం. స్పేయిరా అంటే గోళం లేదా బంతి. ఈ ఆవరణాన్ని ఆంగ్లభాషలో లిథోస్పియర్ అంటారు. దీనిని ఆశ్మావరణం అని కూడా పిలుస్తారు. భూమి, దానిపై ఘనరూపంలో ఉండే భాగాలన్నింటిని శిలావరణం అంటారు.

- భూ ఉపరితలం నుంచి సగటున 40 కి.మీ. లోతు వరకు విస్తరించి ఉన్న ఘనస్థితిలోని భూమి బాహ్యపొర.
- భూమిపై ఉండే పర్వతాలు, మట్టిపొరలు, పీఠభూములు, రాళ్లు మొదలైనవి శిలావరణం కిందికి వస్తాయి.
- భూమి ఉపరితలం పొరను సాంద్ర మండలం అంటారు. భూమి పొరల్లో ఉండే మట్టి ఖనిజాలు, ఖనిజ ఇంధనాలు మొదలైనవి శిలావరణంలో చేరతాయి.

జీవావరణం

పర్యావరణ వ్యవస్థలోని వాతావరణం, జలావరణం, శిలావరణాలు వ్యాపించి జీవులకు అనువైన ఆవరణ భాగాన్ని జీవావరణం అంటారు. జీవావరణం భూ ఉపరితలం మీదనూ, భూ ఉపరితలం నుంచి దాదాపు 200 మీ. లోతు వరకు, భూ ఉపరితలం వాతావరణంలో దాదాపు 7 నుంచి 8 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంది.



- సూక్ష్మక్రిములు, బ్యాక్టీరియా, వైరస్, మొక్కల నుంచి వెలువడే బీజాంకురాలు, పుప్పొడి కణాలు వాతావరణంలోని వాయువుల ద్వారా అంతటా వ్యాపిస్తాయి.
- అలాగే కోట్లాది జీవులు సముద్ర జలాల్లో నివశిస్తున్నాయి. కాబట్టి జీవులకు అనువైన జలావరణం, వాతావరణం, శిలావరణం వీటన్నింటినీ జీవావరణం అంటారు.
- జీవావరణంలో జీవుల మధ్య పరస్పరము ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉంటుంది. వీటినే ఉతక్షొత్తిదారులు వినియోగదారులు, విచ్ఛిన్నకారులు అంటారు.

పర్యావరణంపై మానవుని ప్రభావం

సహజసిద్ధ పర్యావరణంలో భూమిపై నివశిస్తున్న భిన్నరకాల జీవజాతులు, చుట్టూ ఉన్న పరిసరాలకు అనుగుణంగా, పరిసరాలకు లోబడి నివసించేవి. ప్రతి జీవి జీవన చర్యలను వాటి చుట్టూ ఉన్న పర్యావరణంలోని వనరులు నియంత్రిస్తాయి.

- సహజసిద్ధ పర్యావరణంలో జీవులకు, వాటి చుట్టూ ఉన్న పరిసరాలకు మధ్య గల సంబంధాలు సకారాత్మకంగా ఉన్నందున పర్యావరణ సమతుల్యం స్థిరంగా ఉంటుంది.
- జీవరాశులన్నింటిలో ఒక్క మానవునికి మాత్రమే తన పరిసరాల్లోని సహజ వనరులను వివిధ రూపాల్లో వినియోగించుకునే సామర్థ్యం ఉంది.
- ప్రాచీన మానవుడు తన కనీస అవసరాలు(గాలి, నీరు, నేల, ఆవాసం) మేరకే సహజ వనరులను వినియోగించేవాడు. దీనిలో భాగంగా ఏర్పడే వ్యర్థాలను తన చుట్టూ ఉన్న పర్యావరణం సులభంగా తనలో ఇముడ్చుకునేది.
- మానవుడు నిప్పును కనిపెట్టడంతో పర్యావరణంపై మానవ ప్రభావం ప్రారంభమైంది. దీనితో క్రూర మృగాలను దెబ్బతీయడం, అడవులను తగులపెట్టి వ్యవసాయ భూములుగా మార్చడం, స్థిర వ్యవసాయాన్ని ప్రారంభించడంతో ఆవరణ వ్యవస్థలపై మానవుని ప్రభావం వేగవంతమైందని చెప్పవచ్చు.

పారిశ్రామిక విప్లవం తరవాత పర్యావరణంపై మానవ ప్రభావం పెరగడానికి, పర్యావరణ వనరులు క్షీణించడానికి గల కారణాలు

1) జనాభా పెరుగుదల 2) వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామికీకరణ, పట్టణీకరణ 3) ఆధునిక ప్రపంచ ఆర్థిక పోకడలు(సరళీకరణ, ప్రపంచీకరణ) 4) శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం 5) కొత్త వినిమయ సంస్కృతి కారణంగా ఘన వ్యర్థాలు పెరగడం.

- ఉపాధికి ప్రజలు పట్టణాలకు వలస వెళ్లడం వల్ల అక్కడ జనాభా పెరిగి నగర ఆవరణ వ్యవస్థలు కాలుష్యానికి గురయ్యాయి. మురికివాడల సంఖ్య పెరిగింది.
- మానవుడు తన సాంకేతిక నైపుణ్యం ద్వారా తన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడంతో సహజ ఆవరణ వ్యవస్థ తన స్వభావాన్ని మార్చుకోవడంతో సహజ వనరుల నాణ్యత తగ్గి జీవ వైవిధ్యత దెబ్బతింటుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ధాన్యాల ఉత్పత్తిని అధికం చేసే ప్రయత్నంలో హరితవిప్లవ సాంకేతిక పద్ధతులు ఉపయోగించడం వల్ల జల వనరులు కాడ్మియం, ఫ్లోరిన్, లెడ్ లాంటి భార లోహకాలతో కలుషితమయ్యాయి.
- మానవుడు అభివృద్ధి కార్యకలాపాలు, ఆర్థిక ప్రయోజనాలకు, విలాసవంతమైన జీవనానికి భవిష్యత్ తరాలకు అందించాల్సిన వనరులను కూడా దెబ్బతీస్తున్నాడు. దీని ఫలితమే గ్లోబల్ వార్మింగ్, ఆమ్ల వర్షాలు, ఓజోన్ పొర క్షీణత, జల వనరుల కొరత, భూకంపం, సునామీలు ఏర్పడుతున్నాయి.
- పై వాటితో పాటు నివాస, పారిశ్రామిక ప్రాంతాల నుంచి విడుదలయ్యే మురుగు, పంట పొలాలు, చేపల చెరువులు, రొయ్యల చెరువుల నుంచి విడుదలయ్యే వ్యర్థాలు, పోషకాలు జలాశయాల్లో చేరుతున్నాయి. దాంతో జలాశయాలు యూట్రిఫికేషన్ కాలుష్యానికి లోనై సాగు, తాగు నీటికి పనికిరాకుండా పోతున్నాయి.
- అదేవిధంగా కోస్టల్ కారిడార్ నిర్మాణాలు, ట్రాలరీ బోట్స్, డీప్ - సీ - ఫిషింగ్ విధానాల వల్ల కోస్తా ఆవరణ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి.
- పైన తెలిపిన ధోరణులను పరిశీలిస్తే మానవుడు తన జీవన శైలిని పర్యావరణ సామర్థ్యానికి అనుకూలంగా మార్చుకోవాలి. పర్యావరణానికి, మానవునికి మధ్య సంబంధాలు సహకారాత్మకంగా ఉండాలి. లేకపోతే పర్యావరణ ఆధిపత్యం శీతోష్ణస్థితిలో మార్పుల రూపంలో అధికమై జీవజాతి మనుగడే ప్రమాదంలో పడుతుంది.
- మానవుడు అభివృద్ధి కార్యక్రమాల్లో చేపట్టే చర్యల వల్ల ఏర్పడే పర్యావరణ క్షీణతను జీవావరణ వధ అని పిలుస్తారు. ఈ పదాన్ని మొదటి సారిగా 1972లో స్టాక్‌హోమ్‌లో జరిగిన అంతర్జాతీయ పర్యావరణ సదస్సులో ఉపయోగించారు.



వి. వెంకట్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

పాచికలు

పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్



పాచికలు టాపిక్‌కి సంబంధించిన ప్రశ్నలలో ఒక పాచిక రెండు లేదా మూడు లేదా నాలుగు స్థితులను(పొజిషన్) ఇస్తుంటారు. ఆ డయాగ్రామ్స్‌లో అంకెలను లేదా వర్ణమాల అక్షరాలను లేదా చుక్కలను లేదా మేథమెటికల్ గుర్తు (+, -, x, ÷)లను లేదా చిన్న చిన్న రేఖాచిత్రాలను (△, □, ▭, ▯) ఇస్తారు. డయాగ్రామ్స్‌లో ఇచ్చిన ఏదేని అంకె లేదా చుక్కలు లేదా వర్ణమాల అక్షరాల్లో ఏదో ఒక దానిని తెలుపుతూ దానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె లేదా అక్షరం లేదా గుర్తు లేదా రేఖాచిత్రాన్ని తెలపమని అడుగుతారు.

పాచికకు(సిక్స్ సైడ్స్) ఆరు ముఖభాగాలు ఉంటాయి. ప్రతి ముఖభాగానికి ఎదురు ముఖభాగం అనేది ఉంటుంది. ఎదురు ముఖభాగం అనేది కనిపించదు. ప్రతి ముఖ భాగానికి (ఫోర్ సైడ్స్) నాలుగు పక్కపక్క ముఖభాగాలు కనిపించే విధంగా ఉంటాయి. ఒక ముఖభాగం కనిపించదు. కనిపించని ముఖభాగాన్ని ఎదురు ముఖభాగంగా గుర్తించాలి.


ఈవిధంగా పాచికకు ఆరు ముఖభాగాలు ఉంటాయి.

ఆరు ముఖభాగాలు ఉండే పద్ధతి (రూల్)

అడిగినటువంటి ముఖభాగంలో గల అక్షరం		దానికి కనిపించే విధంగా నాలుగు పక్క ముఖభాగాలు		అడిగినటువంటి ముఖభాగానికి ఎదురుగా (కనబడకుండా) ఉండే ముఖభాగం
1	+	4	+	1
				= 6 (సిక్స్ సైడ్స్)

గమనిక: ఏదేని ఒక ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగం కనబడదు అనేది అర్థమైనది. ఈ టాపిక్‌కి సంబంధించిన ప్రశ్నలన్నీ ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం లేదా సంఖ్య లేదా గుర్తు ఆ విధంగా మాత్రమే ఉంటాయి.

1. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 2 అనే అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె ఏది?




ఎ) 6 బి) 4 సి) 5 డి) 3

సమాధానం: (సి)

వివరణ: ఇచ్చిన పాచికల స్థితులను గమనిస్తే
మొదటి డయాగ్రమ్‌లో 2కు పక్కగా 1, 3 అంకెలు
రెండో డయాగ్రమ్‌లో 2కు పక్కగా 3, 4 అంకెలు
నాలుగో డయాగ్రమ్‌లో 2కు పక్కగా 1, 6 అంకెలు కనిపిస్తున్నాయి. అనగా 2కు పక్కగా 1, 3, 4, 6 అంకెలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ '2'కు పక్కగా '5' అంకె కనిపించడం లేదు. కాబట్టి 2 అనే అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె '5' అవుతుంది. కాబట్టి సమాధానం (సి) అవుతుంది.

2. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 6 అనే అంకె గల ముఖభాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె ఏది?




ఎ) 4 బి) 2 సి) 1 డి) 5

సమాధానం: (ఎ)

వివరణ: ఇచ్చిన పాచిక స్థితులను గమనిస్తే మొదటి డయాగ్రమ్‌లో 6కు పక్కగా 1, 3 అంకెలు
రెండో డయాగ్రమ్‌లో 6కు పక్కగా 5, 3 అంకెలు
మూడో డయాగ్రమ్‌లో 6కు పక్కగా 5, 2 అంకెలు కనిపిస్తున్నాయి. అనగా 6కు పక్కగా 1, 2, 3, 5 అంకెలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ '6'కు పక్కగా 4 అంకె కనిపించడం లేదు. కాబట్టి 6 అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖ భాగంలో గల అంకె '4' అవుతుంది. కాబట్టి సమాధానం(ఎ) అవుతుంది.

3. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 'Q' అనే అక్షరం గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం ఏది?



ఎ) T బి) U సి) R డి) S

సమాధానం: (డి)

వివరణ: ఇటువంటి ప్రశ్నల్లో ముందుగా ఇచ్చిన ఆరు అక్షరాలు పరిశీలించాలి.

ఈ ప్రశ్నలో ఇచ్చిన ఆరు అక్షరాలు P, Q, R, S, T, U పై డయాగ్రమ్‌లలో మూడో డయాగ్రమ్‌లో మాత్రమే 'Q' ఉంది. Qకు పక్కగా గల అక్షరాలు P, R. అనగా Uకు ఎదురుగా ఉండే ముఖభాగంలో S, T, Uల్లో కచ్చితంగా ఏ అక్షరం ఉంటుందో తెలియడంలేదు. ఇలాంటి సందర్భాల్లో అడిగినటువంటి అక్షరం గల పాచిక వదిలివేసి మిగిలిన పాచికల్లో కామన్ లెటర్ ఉంటే ఆ అక్షరమే సమాధానం అవుతుంది. దానిని మరింత వివరంగా తెలుసుకుందాం. ఈ ప్రశ్నలో Q అనే అక్షరం గల మూడో పాచికను వదిలివేసి మిగిలిన 1, 2, 4 పాచికల్లో S అనేది కామన్ లెటర్ ఇప్పుడు 'S'ని పరిశీలిస్తే మొదటి డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా P, T అక్షరాలు
రెండో డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా P, R అక్షరాలు
నాలుగో డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా U, R అక్షరాలు కనిపిస్తున్నాయి. అనగా 'S'కు పక్కగా P, R, R, U అక్షరాలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ 'S'కు పక్కగా 'Q' అక్షరం కనిపించడం లేదు. అనగా 'S'కి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం 'Q' అని అర్థం. (అనగా Q అండ్ S లుఆపోజిట్ సైడ్స్) కాబట్టి సమాధానం (డి) అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

దేవరగట్టు.. తలలు పగిలేట్టు



దేవరగట్టుపై కర్రల సమరం సాగిస్తున్న భక్తులు

- ఉత్సవమూర్తుల కోసం హోరాహోరీగా కర్రల సమరం
- 80 మందికిపైగా గాయాలు... కొందరికి పగిలిన తలలు
- కర్నూలు జిల్లాలో అనాదిగా వస్తున్న ఆచారం

ఆలూరు, అక్టోబరు 13: కర్నూలు జిల్లా హొళగుంద మండలం దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో శనివారం విజయదశమి రోజున అర్ధరాత్రి బన్ని (కర్రల సమరం) హోరాహోరీగా సాగింది. ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున జనం తరలివచ్చారు. ఒళ్లు గగుర్పొడిచేలా సాగిన ఈ పోరాటంలో పదుల సంఖ్యలో భక్తులు గాయాలపాలయ్యారు. మరి కొంత మంది తలలు పగిలాయి. శనివారం అర్ధరాత్రి నెరణికి, నెరణికి తండా.. కొత్తపేట, అరికెర గ్రామాల భక్తులు ఇనుప రింగులు తొడిగిన కర్రలతో సమరానికి బయల్దేరారు. చేతిలో అగ్ని దివిటీలతో 'డిర్ర్.. గో పరాక్..' అంటూ కేకలు వేస్తూ ఉత్సవమూర్తులను దక్కించుకునే సమయంలో పోటీ పడ్డారు. ఎప్పటిలాగే నెరణికి గ్రామస్థులే ఉత్సవ మూర్తులను దక్కించుకుని తమ గ్రామానికి తీసుకెళ్లే సమయంలో కొత్తపేట, అరికెర, నెరణికి తండాలకు చెందిన భక్తులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కర్రలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ సమరంలో 80మందికి పైగా గాయాలపాలయ్యారు. వారికి పసుపు పూసి చికిత్స నిమిత్తం ఆలూరు, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కర్రలతో దాడులను నివారించేందుకు పోలీసులు వారం ముందునుంచే అవగాహన కల్పిస్తూ వచ్చారు.

బైక్ అదుపు తప్పి ముగ్గురు మృతి

దేవరగట్టు ఉత్సవానికి వస్తుండగా ఘటన

ఆలూరు, అక్టోబరు 13 : దేవరగట్టు బన్ని ఉత్సవాలను వీక్షించేందుకు వెళ్తున్న ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా తగ్గి నబుదిహాల్ గ్రామనికి చెందిన హరీష్(22), మల్లికార్జున (26), రవి కుమార్ (27) ముగ్గురూ ఒకే బైక్‌పై దేవరగట్టు ఉత్సవాలను వీక్షించేందుకు హొళగుందకు బయల్దేరారు. హొళగుంద మండలం అరికెర క్రాస్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. యువకులు బళ్లారి జిల్లా కరేకల్లు జిందాల్ ఫ్యాక్టరీలో దినకూలీలుగా పనిచేస్తున్నారు.




హరీష్, మల్లికార్జున



రవి కుమార్

తిరుమలలో వైభవంగా చక్రస్నానం



చక్రత్తాళ్వారును పుష్కరిణిలోకి తీసుకొస్తున్న అర్చకులు

- ధ్వజావరోహణంతో ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- వాహన సేవలను వీక్షించిన 15 లక్షల మంది భక్తులు : టీటీడీ ఈవో

తిరుమల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన చక్రస్నానం శనివారం వైభవంగా జరిగింది. 9 రోజుల పాటు వైభవంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు చక్రస్నానం, ధ్వజావరోహణంతో టీటీడీ ముగింపు పలికింది. ముందుగా తెల్లవారుజామున 3 నుంచి 6గంటల వరకు స్వామి కి పల్లకీ ఉత్సవం, ఉదయం 6నుంచి 9గంటల మధ్యలో శ్రీభూవరాహస్వామి ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామికి, సుదర్శన చక్రత్తాళ్వారుకు స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా నిర్వహించారు. తర్వాత సుదర్శన చక్రాన్ని పవిత్ర పుష్కరిణి జలంలో మునక వేయించగా, భక్తులు కూడా అదే సమయంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఇక, శనివారం సాయంత్రం ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద ధ్వజావరోహణాన్ని ఆగమోక్తంగా నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. సాధారణంగా చక్రస్నానం అనంతరం తిరుమలలో పూర్తిగా రద్దీ తగ్గిపోతుంది. అయితే పెరటాసి మాసం చివరి శనివారం కావడంతో శని, ఆదివారాలు కూడా భక్తుల రద్దీ కొనసాగింది. ధ్వజావరోహణం ముందు మాడవీధుల్లో నిర్వహించిన తిరుచ్చి వాహనసేవలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. కాగా, చక్రస్నానంలో టీటీడీ ఉన్నతాధికారులతో పాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ రవినాథ్ తిల్హరి పాల్గొన్నారు. ఉదయం వీరు ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.

విజయవంతంగా బ్రహ్మోత్సవాలు: టీటీడీ ఈవో

సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించినట్లు టీటీడీ ఈవో శ్యామల రావు సంతోషం వ్యక్తం చేశారు. టీటీడీ చేపట్టిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో మొత్తం 6 లక్షల మంది మూలవిరాట్టును దర్శించుకోగా, దాదాపు 15 లక్షల మంది శ్రీవారి వాహన సేవలను వీక్షించారని చెప్పారు. ప్రత్యేకించి గరుడసేవలో దాదాపు 3.5 లక్షల మంది భక్తులు పాల్గొన్నట్టు తెలిపారు.

శ్రీవారికి సీఎం పట్టువస్త్రాల సమర్పణపై వ్యంగ్యంగా పోస్టు

- విజిలెన్స్ ఫిర్యాదుతో కేసు నమోదు

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సీఎం చంద్రబాబు పట్టువస్త్రాల సమర్పణపై వ్యంగ్యంగా పోస్ట్ చేసిన వ్యవహారంపై టీటీడీ సీరియస్ అయింది. విజిలెన్స్ వింగ్ ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బ్రహ్మోత్సవాల్లో తొలిరోజైన ఈ నెల 4న చంద్రబాబు.. శ్రీవారికి సమర్పించే పట్టువస్త్రాలు తలపై పెట్టుకుని ధ్వజస్తంభానికి మొక్కుతున్న వీడియో స్క్రీన్ షార్ట్‌ను చైతన్య అనే వ్యక్తి 'బ్లైండ్ మన్' అనే ఎక్స్ పేజీలో పోస్టు చేశారు. దానికింద 'దేవుడికి ఇష్టం లేదు అని స్పష్టంగా కనిపిస్తుంది. మళ్లీ చెప్తున్నా ప్రాణగండం ఉంది' అంటూ నవ్వుతున్న రెండు ఎమోజీలను జత చేశారు. ఈ వ్యవహారంపై టీటీడీ విజిలెన్స్ విభాగం ఏవీఎస్వో పద్మనాభం ఫిర్యాదు చేశారు. చైతన్యతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

పోటెత్తిన ఇంద్రకీలాద్రి





శనివారం బెజవాడ దుర్గమ్మ దర్శనం కోసం తరలి వచ్చిన భవానీ దీక్షాధారులు; (ఇన్‌సెట్) రాజరాజేశ్వరీ రూపంలో దుర్గమ్మ

- విజయదశమికి భారీగా తరలివచ్చిన భక్తులు
- మూలా నక్షత్రం రోజు కంటే ఎక్కువగా రాక
- ఒక్కరోజే సుమారు 2 లక్షల మందికి దర్శనం
- కృష్ణానదికి ఇన్‌ఫ్లో కారణంగా నదీ విహారం రద్దు
- ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

విజయవాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారం ముగిశాయి. పూర్ణాహుతితో ఉత్సవాలకు ముగింపు పలికారు. శ్రీరాజరాజేశ్వరీ దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. శనివారం సాయంత్రం పార్వతి, గంగ సమేత మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తులకు నగరోత్సవం నిర్వహించారు. అనంతరం కనకదుర్గానగర్ మీదుగా దుర్గాఘాట్‌కు తీసుకొచ్చి హంస వాహనంపై ఉంచి పూజలు చేశారు. కృష్ణానదికి ఇన్‌ఫ్లో కారణంగా నదీ విహారాన్ని రద్దు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను పోలీసులకు అప్పగించారు. వారు దుర్గాఘాట్ నుంచి ఊరేగింపుగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇక్కడ శమీవృక్షం వద్ద ఉన్న ఆలయంలో శమీపూజ నిర్వహించిన అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ అర్చకులకు అప్పగించారు. కాగా, విజయదశమి ఒక్కరోజే సుమారు 2లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది దశమి రోజు అంతకుమించి తరలివచ్చా రు. ఆలయానికి ఉన్న అన్ని వైపులా రహదారులు భక్తులతో నిండిపోయాయి. పోలీసులు అప్పటికప్పుడు అదనపు బందోబస్తును ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. తొలిసారిగా ఆక్టోపస్‌ను రంగంలోకి దింపారు. భక్తుల రాక వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఏడు డ్రోన్లను ఉపయోగించారు. ఉత్సవాల చరిత్రలోనే తొలిసారిగా దసరా రోజు, ఆ మర్నాడు హోల్డింగ్ పాయింట్లను ఉపయోగించాల్సి వచ్చింది. భక్తుల రద్దీ కారణంగా విజయదశమి రోజున అన్ని వీఐపీ, వీవీఐపీ దర్శనాలను రద్దు చేశారు. ఆదివారం కూడా రద్దీ కొనసాగింది.

అక్రమ నిర్మాణాలకు చిరునామా గ్రీన్ గ్రేస్

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



పొన్నూరుటౌన్, అక్టోబరు 13: గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్లు అక్రమ నిర్మాణాలకు చిరునామాగా మారాయని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపించారు. శనివారం పొన్నూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్ల నిర్మాణంలో నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారని స్పష్టం చేశారు. అధికారాన్ని అడ్డం పెటుకొన్ని అనేక అక్రమాలకు నిర్మాణదారులు పాల్పడ్డారని ఆరోపించారు. అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేస్తూ వినియోగదారుల నుంచి డబ్బులు వసూళ్లు చేసి మోసం చేశారని ధ్వజమెత్తారు. అంబటి మురళీకృష్ణకు ఈ అక్రమాలు తెలిసే మోసగించారని దుయ్యబట్టారు. స్వయంగా అంబటి మురళీకృష్ణ జి + 4 నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయని వెల్లడించటమే మిగిలిన నిర్మాణాలకు అనుమతులు లేవని స్పష్టమౌతుందన్నారు. రైల్వే ఎన్వోసీ లేకపోయినా నిర్మాణాలు చేపట్టడం అక్రమం కాదా అని ప్రశ్నించారు. నిర్మాణ రంగంలో సుదీర్ఘ అనుభవం ఉందని చెబుతున్న అంబటి మురళీకృష్ణ అనుమతులు లేకుండా ఎలా నిర్మాణాలు చేపట్టారని నిలదీశారు. ఎన్నికల సమయంలో తనపై అనేకసార్లు అభూత కల్పనలతో అసత్య ప్రచారాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కక్ష సాధింపులకు పొన్నూరులో తావులేదన్నారు. కానీ తనపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని గుర్తు చేసుకున్నారు. ఎన్నికల సమయంలో తనను తిరిగి జైలుకు పంపుతామని అంబటి మురళీకృష్ణ ప్రచార వేదికలపై ప్రకటించి బెదిరింపులకు పాల్పడింది నిజం కాదా అన్ని ప్రశ్నించారు. కానీ తాను మాత్రం వినియోదారుల శ్రేయస్సే లక్ష్యంగా గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్ అక్రమ నిర్మాణాలపై పోరాడుతున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

బగళాముఖి అమ్మవారికి ఎంపీ దంపతుల ప్రత్యేక పూజలు



ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు దంపతులను సత్కరిస్తున్న ఫెస్టివల్ అధికారి నరసింహమూర్తి

పిట్టలవానిపాలెం, అక్టోబరు 13: పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న దేవీశరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పూర్ణాహుతి కార్యక్రమానికి పల్నాడు జిల్లా నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణ కార్యదర్శి కె.నాగేశ్వరరావు, ఆలయ చీఫ్ ఫెస్టివల్ అధికారి జి.నరసింహమూర్తి వారికి హోమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి దుశ్శాలువా, అమ్మవారి చిత్రపటాలతో ఘనంగా సత్కరించారు. తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు దంపతులకు బగళాముఖి అమ్మవారి ఆలయ విశిష్టతను నాగేశ్వరరావు, నరసింహమూర్తి తెలియజేశారు.

రైళ్లు కిటకిట

● దసరా సెలవులు ముగియడంతో వేల మంది తిరుగు ప్రయాణం
● టిక్కెట్‌లు కన్‌ఫర్మ్ కాక ఫుట్‌బోర్డు వద్ద వేలాడుతూ జర్నీ
● ప్రీమియం తత్కాల్‌లోనూ బుకింగ్స్ ఫుల్



లింగంపల్లి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ గుంటూరు రైల్వేస్టేషన్‌కు వచ్చిన సమయంలో ప్రయాణికుల రద్దీ

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ సెలవులు ముగియడంతో వేరే ఊళ్ల నుంచి వచ్చిన వారంతా ఆదివారం మధ్యాహ్నం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో గుంటూరు రైల్వేజంక్షన్ మీదగా సికింద్రాబాద్, బెంగళూరు, చెన్నై, తిరువనంతపురం, విశాఖపట్నం, భువనేశ్వర్, హౌరా వెళ్లే రైళ్లన్నీ రద్దీగా మారాయి. వెయిటింగ్ లిస్టులు క్లియర్ కాకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రయాణికులు చాలామంది రైలు బోగీల ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రమాదకరరీతిలో బయలుదేరి వెళ్లారు. ముఖ్యంగా ఆదివారం సాయంత్రం విజయవాడ - లింగంపల్లి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ గుంటూరు రైల్వేస్టేషన్‌కు వచ్చినప్పుడు కిక్కిరిసిపోయింది. ఆ రైలులో అప్పటికే విజయవాడ, మంగళగిరిలో ఎక్కిన ప్రయాణికులతో బోగీలన్నీ నిండిపోగా ఇక్కడ వేలమంది ఎక్కడంతో కిటకిటలాడింది. మిగతా రైళ్లలోనూ ఇదే పరిస్థితి కనిపించింది.

ఎక్కువ ఛార్జీలు పెట్టి బుకింగ్..

దసర సందర్భంగా విద్యార్థులకు 10 రోజులు సెలవులు వచ్చాయి. ఉద్యోగులకు అయితే మూడు రోజులు సెలవులు(ఆదివారంతో కలుపుకొని) ప్రభుత్వం ఇచ్చింది. దీంతో ఇతర రాష్ట్రాల్లో విద్య, ఉద్యోగ, ఉపాధి రీత్యా ఉంటున్న వారంతా దసర పండగని సొంత ఊరిలో కుటుంబ సభ్యుల మధ్యన ఆనందంగా జరుపుకునేందుకు తరలివచ్చారు. పండగ శనివారం ముగిసింది. అయితే మాంసాహార వంటకాలను ఆదివారం ఆరగించి మధ్యాహ్నం 2 గంటల తర్వాత తిరుగు ప్రయాణమయ్యారు. సికింద్రాబాద్ వైపునకు విశాఖపట్నం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌తో రద్దీ మొదలైంది. ఆ తర్వాత వరుసగా నాగర్‌సోల్, నాందేడ్, సంత్రగచి స్పెషల్, నాగర్‌కోయిల్ - కాచీగూడ, ఇంటర్‌సిటీ (వయా వరంగల్), లింగంపల్లి ఇంటర్‌సిటీ, వందేభారత్ రైళ్లు బయలుదేరి వెళ్లాయి. ఇవికాక రాత్రి నరసపూర్, చెన్నై, నారయణాద్రి, డెల్టా, విశాఖ, కాకినాడ, మచిలీపట్నం స్పెషల్ రైళ్లు కూడా సికింద్రాబాద్‌కు వెళ్లాయి. వీటిల్లో ఏ ఒక్క దానిలోనూ రిజర్వుడ్ టిక్కెట్‌లు ఖాళీ లేవు. ప్రీమియం తత్కాల్ టిక్కెట్లను రెట్టింపు కంటే ఎక్కువ ఛార్జీలు పెట్టి బుకింగ్ చేసుకున్నారు.

ఒక్కటున్నా ప్రత్యేక రైలు ఉంటే..

మరోవైపు బెంగళూరు మార్గంలో రైళ్లు కూడా కిక్కిరిశాయి. ప్రశాంతి, హంబ్లీ, వాస్కోడిగామ, ధర్మవరం తదితర రైళ్లలోనూ వేల మంది ప్రయాణం చేశారు. ఇక సికింద్రాబాద్ నుంచి తిరువనంతపురంకు బయలుదేరి గుంటూరుకు వచ్చిన శబరి ఎక్స్‌ప్రెస్‌లో అడుగు తీసి అడుగు వేయడానికి ఖాళీ లేనంత రద్దీ తలెత్తింది. విశాఖపట్నంకు ఆదివారం మధ్యాహ్నం వెళ్లిన ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లోనూ ఖాళీలు లేకుండా ఏసీ సీట్లు అన్ని బుకింగ్ అయ్యాయి. రైల్వే శాఖ కొన్ని ప్రత్యేక రైళ్లను వేరే ప్రాంతాలకు ఏర్పాటు చేసి గుంటూరు మీదగా నడిపింది. దానివలన ఇక్కడి ప్రయాణికులకు పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. కనీసం ఒక్కటున్నా ప్రత్యేక రైలు గుంటూరు నుంచి సికింద్రాబాద్/బెంగళూరుకు ఏర్పాటు చేసి ఉంటే ప్రయాణికులకు మేలు జరిగేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఉత్తమ ప్రదర్శనలుగా స్వేచ్ఛ నాటకం, చిగురుమేఘం నాటిక



ప్రముఖ రంగస్థల నటుడు గోపాలరావును సుబ్రహ్మణ్య శాస్త్రి పురస్కారంతో సత్కరిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

తెనాలి అర్బన్, అక్టోబరు 13 : కళల కాణాచి, వేద గంగోత్రి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన నాటకోత్సవాల్లో చిగురుమేఘం సాంఘిక నాటిక, స్వేచ్ఛ నాటకం ఉత్తమ ప్రదర్శనలుగా నిలిచాయి. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఈ నెల 7న ప్రారంభమైన నాటక, నాటికల పోటీలు శనివారం ముగిశాయి. చెరుకుమల్లి సింగారావు అధ్యక్షతన నిర్వహించిన ముగింపు సభలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులు అందజేశారు. ప్రముఖ రంగస్థల పౌరాణిక నటుడు యడ్ల గోపాలరావును బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి రంగస్థల పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సాంఘిక నాటికల విభాగంలో ఉత్తమ ప్రదర్శనగా చిగురుమేఘం, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా నా శత్రువు, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా మతమా-మానవత్వమా బహుమతులు అందుకున్నాయి. ఉత్తమ దర్శకునిగా హరిబాబు, సహాయ నటునిగా రవిబాబు, రంగాలంకరణలో రామ్మోహన్, ఆహార్యంలో రమణరావు, సంగీతంలో సాయితేజ, రచనలో తామేశ్వరయ్య, హాస్యనటునిగా పండు, ప్రతినాయకునిగా మంజునాథ, క్యారెక్టర్ నటిగా జ్యోతిర్మయి, క్యారెక్టర్ నటునిగా కృష్ణమూర్తి, ఉత్తమ నటిగా సురభి లలిత, ఉత్తమ నటునిగా కావూరి సత్యనారాయణ బహుమతులు అందుకున్నారు. సాంఘిక నాటకాల విభాగంలో ఉత్తమ ప్రదర్శనగా స్వేచ్ఛ, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా మంత్రనగరి నాటకం బహుమతులు సాధించాయి. ఉత్తమ దర్శకునిగా డీఎం రెడ్డి, రంగాలంకరణలో దివాకర్ ఫణీంద్ర, ఆహార్యంలో థామస్, గాయకునిగా లీలా మోహన్, ఉత్తమ రచయితగా శివరామ్, సహాయ నటిగా మంజుభార్గవి, ప్రతినాయకునిగా రామారావు, క్యారెక్టర్ నటిగా కుసుమసాయి, నటునిగా బాలాజీనాయక్, ఉత్తమ నటిగా ప్రభావతి, నటునిగా గోవాడ వెంకట్ ఎంపికయ్యారు. విజేతలకు బుర్రా సాయిమాదవ్, ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి, డబుల్ హార్స్ ఎండీ మునగాల శ్యాంప్రసాద్, వరప్రసాద్, జయలక్ష్మి, గరికపాటి సుబ్బారావు, ఆదినారాయణ, కె.సాంబశివరావు బహుమతులు అందజేశారు.

అవయవ దాన ఉద్యమం మరింత ముందుకు..



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న రమణ యశస్వి

గుంటూరు (మెడికల్) అక్టోబరు 13: ఆంధ్రప్రదేశ్ శరీర, అవయవ దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ రమణ యశస్వి బాధ్యతలు స్వీకరించారు. శనివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు, సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ గూడూరు సీతా మహాలక్ష్మి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యుడుగా, కవిగా, రచయితగా, చిత్రకారుడుగా, వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులుగా వైద్య, సాహిత్య, సేవా రంగాల్లో తనదైన ముద్ర వేసిన డాక్టర్ రమణ యశస్వి ఆయా రంగాల్లో వందకుపైగా అవార్డులు అందుకోవడం ప్రశంసనీయమన్నారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రంలో శరీర, అవయవదానం ఉద్యమం మరింత ముందుకు వెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ శరీర, అవయవదానం పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు పెద్దఎత్తున సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం సంఘం నూతన అధ్యక్షుడుగా నియమితులైన డాక్టర్ రమణ యశస్విని చైర్‌పర్సన్ గూడూరు సీతా మహాలక్ష్మి శాలువాతో సత్కరించారు.

వైసీపీ అరాచక శక్తుల ఆగడాలపై చర్యలు తీసుకోవాలి

● రెండు రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష



గుంటూరులో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న కోపూరి లక్ష్మి, తెలుగు మహిళలు

గుంటూరు, అక్టోబరు 13: గత వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలు, ఆగడాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గుంటూరుకు చెందిన ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు కోపూరి లక్ష్మి స్వీయ గృహ నిర్బంధ నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. విజయదశమి పండగ రోజున ప్రారంభించిన నిరవధిక నిరాహార దీక్ష రెండో రోజుకు చేరుకుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా దళితులు, ప్రతిపక్షాలపై దాడులు, అఘాయిత్యాలు, భూకబ్జాలు, అక్రమ కేసులు వంటి అరాచకాలను నిరసిస్తూ ఆమె గత ఎన్నికలకు ముందు ఏప్రిల్ 20న దేశ రాజధాని ఢిల్లీలో బొటనవేలు నరుక్కొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సాహస నిరసన కార్యక్రమం అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో నాటి వైసీపీ అరాచకాలపై చర్యలు తీసుకుంటారని ఆమె భావించారు. అయితే నెలలు గడుస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆమె ఇటీవల సీఎం చంద్రబాబును స్వయంగా కలసి వైసీపీ అరాచకాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాను నివాసం ఉంటున్న గుంటూరు రూరల్ మండలంలోని కృష్ణతులసి నగర్ తోపాటు స్వర్ణభారతి నగర్, స్వర్ణాంధ్ర నగర్, జన్మభూమి నగర్ తదితర ప్రాంతాల్లో వైసీపీ నాయకులు, రౌడీలు గత ఐదేళ్లలో అరాచకాలు, అఘాయిత్యాలు, భూకబ్జాలకు పాల్పడ్డారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా వారి ఆగడాలు తగ్గలేదని, విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆమె చంద్రబాబుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిని మనసులో పెట్టుకున్న వైసీపీ వర్గీయులు, రౌడీషీటర్లు వివిధ కేసుల్లో పాత నేరస్తులు తమపై హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆమె పేర్కొన్నారు. వీటన్నింటిపై విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో తాను ప్రాణ త్యాగానికైనా సిద్ధమేనని ఆమె ప్రకటించారు. పలువురు టీడీపీ మహిళలు మద్దతు ప్రకటించి దీక్షలో కూర్చున్నారు.

ముగిసిన మంగళగిరి కబడ్డీ లీగ్ పోటీలు

● పురుషుల విజేత తూర్పు గోదావరి జట్టు
● మహిళల విజేత విజయనగరం జట్టు



విజేతగా నిలిచిన విజయనగరం మహిళల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 13: రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో నిర్వహించిన మంగళగిరి కబడ్డీ లీగ్-2024 పోటీలు విజయవంతంగా ముగిశాయి. మంగళగిరి బీఎండబ్ల్యూ షోరూమ్ పక్కన గల మైదానంలో ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట నిర్వహించిన పోటీలు నాలుగు రోజులపాటు క్రీడాభిమానులను అలరించాయి. పురుషులు, మహిళలకు వేర్వేరుగా జరిగిన ఈ లీగ్‌లో ఫైనల్ మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగాయి. పురుషుల విభాగం ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణా జట్టుపై తూర్పు గోదావరి జట్టు 15-18 పాయింట్ల తేడాతో గెలుపొందింది. కృష్ణా జట్టు ద్వితీయ స్థానం, గుంటూరు జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. మహిళల విభాగం ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణా జట్టుపై విజయనగరం జట్టు 8-31 పాయింట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. కృష్ణా జట్టు ద్వితీయ స్థానం, చిత్తూరు జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ట్రోఫీలు, నగదు బహుమతులను అందజేశారు.

బహుమతులు అందజేత

మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో కబడ్డీ పోటీలకు ఈవెంట్ స్పాన్సర్‌గా మురళీకృష్ణ యార్లగడ్డ (మార్క్‌రోస్) వ్యవహరించారు. పురుషుల విభాగంలో విజేతగా నిలిచిన తూర్పు గోదావరి జట్టుకు జవ్వాది కిరణ్‌చంద్ రూ.లక్ష, ద్వితీయ స్థానంలో నిలిచిన కృష్ణా జట్టుకు నందం అబద్దయ్య రూ.75 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన గుంటూరు జట్టుకు గద్దె శ్రీనివాసరావు, జంపాల సుబ్బారావు రూ.50 వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు. మహిళల విభాగంలో విజేతగా నిలిచిన విజయనగరం జట్టుకు ఆవల రవికిరణ్ రూ.లక్ష, ద్వితీయ స్థానంలో నిలిచిన కృష్ణా జట్టుకు గాజుల శ్రీనివాసరావు రూ.75 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన చిత్తూరు జట్టుకు గూడూరు వెంకట్రావు సహకారంతో రూ.50 వేల నగదు బహుమతులను అందజేశారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ సహకారంతో ప్రతిరోజు సాయంత్రం అల్పాహారం అందజేశారు. బహుమతి ప్రదానోత్సవంలో ఏపీ పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడలకు కూటమి ప్రభుత్వం ఎంతగానో ప్రాధాన్యం, ప్రోత్సాహాన్ని అందిస్తుందని అన్నారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలన్న లక్ష్యంతో మంత్రి నారా లోకేశ్ ప్రతిఏటా వివిధ రకాల టోర్నమెంట్లు నిర్వహించడంతోపాటు తాడేపల్లి, మంగళగిరి ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారని తెలిపారు. మంగళగిరిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దడంతోపాటు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై క్రీడాకారులు రాణించడమే లక్ష్యంగా మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని చెప్పారు. కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను, ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ యలమంచిలి శ్రీకాంత్‌ను, ఎంటీఎంసీ అధికారులు, పోలీసు సిబ్బంది, క్రీడా మైదానాన్ని ఇచ్చిన బీఎండబ్ల్యూ యాజమాన్యాన్ని అభినందించారు.

అంతర్జాతీయ వేదికపై సత్తా చాటిన సాదియా

● కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణ పతకం కైవసం



పతకాలతో సాదియా అల్‌మాస్

మంగళగిరి సిటీ, అక్టోబరు 13: అంతర్జాతీయ వేదికపై మంగళగిరికి చెందిన పవర్ లిఫ్టర్ సాదియా అల్‌మాస్ మరోమారు సత్తా చాటారు. ఈ నెల 4 నుంచి 13వ తేదీ వరకు దక్షిణాఫ్రికాలోని సన్‌సిటీలో జరిగిన కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు. సాదియా అల్‌మాస్ 57 కిలోల జూనియర్స్ విభాగం స్క్వాట్‌లో 185 కిలోల బరువును ఎత్తి స్వర్ణం, బెంచిప్రెస్‌లో 95 కిలోల బరువును ఎత్తి స్వర్ణం, డెడ్‌లిఫ్ట్‌లో 180 కిలోల బరువును ఎత్తి స్వర్ణం సాధించడంతోపాటు ఓవరాల్‌గా 460 కిలోల బరువును ఎత్తి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు. కామన్వెల్త్ జూనియర్స్ 57 కిలోల విభాగంలో ఈ ఘనత సాధించిన గుంటూరు జిల్లా లిఫ్టర్‌గా సాదియా చరిత్ర సృష్టించారు. పతకాలు సాధించిన సాదియా అల్‌మాస్‌ను రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ సకల కోటేశ్వరరావు, ఏపీ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సందాని తదితరులు సాదియాకు అభినందనలు తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించే వారికే మద్దతు



షేక్ అబ్దుల్ రజాక్

గుంటూరు సిటీ, అక్టోబరు 13: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వారికే పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో తాము మద్దతు నిస్తామని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ అన్నారు. ఆదివారం ఆయన గుంటూరులో విలేకరులతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని అన్నారు. సచివాలయ ఉద్యోగుల గొంతుకను శాసనమండలిలో వినిపించే అభ్యర్థికి మాత్రమే సచివాలయ ఉద్యోగులు అండగా ఉంటామని తెలిపారు. పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు జరిగే జిల్లాల్లో సుమారు 40 వేల మందికిపైగా సచివాలయ ఉద్యోగులు గ్రాడ్యుయేట్లుగా ఉన్నారని, వీరందరూ ఓటు కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, కృష్ణ జిల్లాల్లో జరగబోవు పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల కొరకు ఆయా జిల్లాల్లోని పట్టభద్రులు, సచివాలయ ఉద్యోగులు ఫామ్ 18 దరఖాస్తు ద్వారా ఓటు నమోదు చేసుకోవాలని అబ్దుల్ రజాక్ సూచించారు.

సూర్యలంక తీరానికి పోటెత్తిన పర్యాటకులు



సూర్యలంక సముద్రతీరంలో స్నానాలను ఆచరిస్తున్న పర్యాటకులు

బాపట్ల రూరల్, అక్టోబరు 13: దసరా సెలవుల్లో ఆఖరిరోజు ఆదివారం కావటంతో బాపట్ల మండలం సూర్యలంక సముద్ర తీరానికి పర్యాటకులు పోటెత్తారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు సూర్యలంక సముద్ర తీరానికి అధిక సంఖ్యలో వచ్చారు. యువకులు తీరంలో కేరింతలు కొడుతూ సముద్ర స్నానాలు చేయగా, చిన్నారులు తీరం ఒడ్డున ఇసుక తిమ్మెలతో ఆడుకుంటూ ఆహ్లాదకరంగా గడిపారు. పర్యాటకులు కుటుంబ సమేతంగా సముద్ర స్నానాలు ఆచరించిన అనంతరం తీరం సమీపంలోని జీడిమామిడి తోటల వద్ద, తోటలు కింద వనభోజనాలు చేస్తూ సంతోషంగా గడిపారు. తీరం ఒడ్డున ఎటువంటి ఘటనలు జరగకుండా బాపట్ల రూరల్, మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు గస్తీని నిర్వహించారు.

నందిగం అనుచరులు అరెస్టు.. విడుదల

తుళ్లూరు, అక్టోబరు 13: ఎన్నికల కౌంటింగ్ రోజు కూటమి ప్రభుత్వం గెలిచిందని ఉద్దండ్రాయునిపాలెంకు చెందిన దళిత జేఏసీ నేత పులి చిన్నా(మరియదాసు)సంబరాలు చేస్తుంటే అతనిపై మాజీ ఎంపీ నందిగం సురేశ్ ఆధ్వర్యంలో ఎనిమిది మంది అనుచరులు దాడి చేశారు. ఘటనపై ఈ ఏడాది జులై 8న తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో బాధితుడు చిన్నా నందిగం ప్రధాన నిందితుడిగా అనుచరులపై ఫిర్యాదు చేశారు. అప్పటి తుళ్లూరు సీఐ సుభాని నందింగంతోపాటు అనుచరులపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఒక మర్డర్ కేసులో గుంటూరు జిల్లా జైలులో నందిగం సురేశ్ రిమాండ్ ఖైదీగా ఉన్నారు. పులి చిన్నా కేసు దర్యాప్తులో భాగంగా శనివారం నందిగం అనుచరులు ఐదుగురిని అరెస్టు చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. తనపై హత్యాయత్నం చేసిన వారిపై చిన్న కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్ ఇవ్వడం ఏమిటని బాధితుడు పులి చిన్నా ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

సత్తెనపల్లి, అక్టోబరు 13: రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడులో ఆదివారం జరిగింది. లక్కరాజుగార్లపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ కోటేశ్వరరావు కుమార్తె కావ్య(14) తన పెద్దమ్మ కుమారుడైన మీసాల వంశీతో కలసి స్కూటీపై ఫిరంగిపురం మండలం వెళ్తుండగా లక్కరాజుగార్లపాడు గ్రామం దాటగానే స్కూటీని ట్రాక్టర్ ఢీకుంది. దీంతో తీవ్ర గాయాలైన కావ్యను, వంశీని చికిత్స నిమిత్తం బంధువులు, కుటుంబ సభ్యులు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే కావ్య మృతి చెందింది. వంశీకి తీవ్ర గాయాలు కావటంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కావ్య తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో ఈతకి దిగి కూలీ మృతి

తుళ్లూరు అక్టోబర్ 13: చెరువులో దూకి వలస కూలీ మృతి చెందిన ఘటన మండల కేంద్రం తుళ్లూరులో శనివారం సాయంత్రం జరిగింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన రామకృష్ణ అలియాస్ రాజు(39) పదేళ్లగా తుళ్లూరులో తాపీ వర్కర్‌గా పని చేస్తున్నాడు. గత రెండేళ్ల నుంచి తుళ్లూరులోని ఐనచెరువుకి చెందిన రాంబాబు అనే మేస్త్రి ఇంట్లోనే ఉంటూ, అతని వద్దే పని చేస్తున్నాడు. శనివారం మద్యం మత్తులో చెరువులో ఈతకు దిగాడని స్థానికులు చెబుతున్నారు. ఈత వచ్చినప్పటికీ ఫుల్‌గా మద్యం తాగి ఉండటంతో మునిగిపోయాడు. అక్కడ వారు గమనించి చెరువులో గాలించారు. అయినా ప్రయోజనం కలగలేదు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలించినా మృతుడి ఆచూకి లభ్యం కాలేదు. తెల్లవారిన తరువాత రామకృష్ణ మృతదేహం చెరువు మధ్యలో తేలింది. బంధువులకు మేస్త్రి రాంబాబు సమాచారం ఇచ్చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుడి కాలువలో పడి వ్యక్తి మృతి

మాచర్ల రూరల్, అక్టోబరు 13: మద్యం మత్తులో కుడి కాలువలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. విజయపురిసౌత్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన గోగుల శివ శంకర్ జేసీబీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనాలపై పైలాన్ వెళ్లి పూటుగా మద్యం తాగారు. తిరిగి వస్తూ ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న శివశంకర్ మార్గమధ్యలో వాహనం నడుపుతున్న వ్యక్తిపై వాంతులు చేసుకున్నాడు. వీరు దుస్తులు కడుక్కునేందుకు మండలంలోని తాళ్లపల్లి కుడి కాలువ వద్ద ఆగారు. కాలువలోకి దిగి దుస్తులు కడుక్కుంటుండగా శివశంకర్ మద్యం మత్తులో కాలువలో పడిపోయాడు. కాగా మృతదేహం ఆదివారం తాళ్లపల్లి బ్రిడ్జి వద్ద లభ్యమైంది. విజయపురిసౌత్ పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి బాబాయి శివ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య శిరీష, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 13 : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 33,516 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 30,225 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని తెలిపారు. వీటిలో 16 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువ కృష్ణకు వస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00



విజయదశమి సందర్భంగా అమ్మవారికి పూజలు చేస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

దసరా వేడుకల్లో ఎంపీ తెన్నేటి పూజలు

బాపట్ల, అక్టోబరు 13 : విజయదశమి వేడుకలను పురస్కరించుకొని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పలుచోట్ల నిర్వహించిన పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో నిర్వహించిన పూజలలో ఆయన భార్య తెన్నేటి శిరీషాతో కలిసి పూజలు చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మండలంలోని శ్రీమహర్షి ఆశ్రమగోశాలలో శ్రీ సంపత్‌గణపతి పరివార్ ఆధ్వర్యంలో బి.బాబునాగేంద్ర నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలలో ఎంపీ పాల్గొన్నారు. వేదపండితుల ఆశీర్వచనాలు అందుకొని ఆశ్రమ పరిసరాలలో మొక్కలు నాటి నీరు పోశారు. సాంప్రదాయబద్దంగా ఆశ్రమం నిర్వహిస్తున్న వారిని ఎంపీ అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొప్పలపూడి రామ్మోహనరావు, పఠాన్ రాజేష్, నక్కా ప్రకాశరావు, గవిని ప్రసాద్, కె.ఏడుకొండలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చండీ హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగేశన

పిట్టలవానిపాలెం, అక్టోబరు 13 : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ విచ్చేసి అమ్మవారి సన్నిధిలో జరుగుతున్న శ్రీదేవిశరన్నవరాత్రి మహోత్సవాలలో ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం చండీ హోమం, పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.నాగేశ్వరరావు, చీఫ్ ఫెస్టివల్ అధికారి జి.నరసింహమూర్తి సంయుక్తంగా ఆలయ మర్యాదలతో వేగేశన నరేంద్రవర్మకు స్వాగతం పలికారు. తొలుత ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కూటమిశ్రేణులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. ఆలయ అర్చకులు వేగేశన నరేంద్రవర్మకు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మను దుశ్శాలువాలతో, అమ్మవారి చిత్రపటాలతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ అమ్మవారి ఆలయంలో ఉన్న సిమెంటు సింహాల స్థానంలో నూతన రాజపీఠం, పంచలోహాలతో తయారు చేసిన సింహాలను తన సొంత నిధులతో అందజేస్తానని తెలిపారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు, చందోలు గ్రామస్తులు వేగేశన నరేంద్రవర్మకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చందోలు గ్రామ, మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.



హోమం, పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

ఇంజనీరింగ్ విభాగం పని తీరును పరిశీలించిన కమిషనర్

బాపట్ల, అక్టోబరు 13 : బాపట్ల పురపాలక సంఘం పరిధిలో పని చేస్తున్న ఇంజనీరింగ్ విభాగ సిబ్బంది పనితీరును మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించి వార్డులలో తాగునీటి సరఫరా గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దిగువప్రాంత కాలనీలైన పెయింటర్స్ కాలనీ, డ్రైవర్స్‌కాలనీ, ప్యాడిసన్‌పేట, ఇంద్రనగర్‌కాలనీ, రాజీవ్‌నగర్, కొత్తపాలెం, గంగపుత్రకాలనీ, బేతనీకాలనీలకు వాటర్‌ట్యాంక్‌ల ద్వారా నీరు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వీధిదీపాలను నిరంతరం పర్యవేక్షించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పార్కుల నిర్వహణ సిబ్బందితో మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం వహించరాదని చెప్పారు.



ఇంజనీరింగ్ సిబ్బంది హాజరు పరిశీలిస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

మాల మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగరాజు



నియామక పత్రం అందుకుంటున్న నాగరాజు

వేమూరు, అక్టోబరు 13 : మాల మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వేమూరుకు చెందిన బుస్సా నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు నాగరాజును మాల మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని సజ్జావారిపాలెంలో జరిగిన మాలల చైతన్య సదస్సులో నాగరాజుకు అందించారు. ఈ సందర్భంగా మల్లెల వెంకట్రావు మాట్లాడుతూ, నాగరాజు మాలల తరుపున చేస్తున్న పోరాటం అనిర్వచనీయమన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవికి ఎంపిక చేసిన జాతీయ అధ్యక్షుడు వెంకట్రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా మార్పు ప్రచారం బాధ కలిగించింది

● మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, అక్టోబరు 13 : అమెరికా దేశంలో ఉన్నప్పుడు బాపట్ల జిల్లా కేంద్రం మార్పు అంటూ సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం తనకెంతో బాధ కలిగించిందని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ ఇన్‌చార్జి కోన రఘుపతి అన్నారు. అమెరికా పర్యటన ముగించుకొని ఆదివారం సాయంత్రం బాపట్ల రైల్వేస్టేషన్‌కు విచ్చేసిన రఘుపతికి పార్టీశ్రేణులు ఘనస్వాగతం పలికారు. రైల్వేస్టేషన్ దగ్గర నుంచి రథంబజారులోని వైసీపీ కార్యాలయం వరకు పాదయాత్రగా విచ్చేశారు. కార్యాలయంలో పార్టీశ్రేణులను ఉద్దేశించి రఘుపతి మాట్లాడుతూ జిల్లా కేంద్రం సాధించుకోవటానికి ఎంతో కష్టపడ్డామన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వారితో కలిసి జిల్లా కేంద్రం తరలిపోకుండా కృషి చేద్దామని చెప్పారు. మెడికల్ కళాశాల నిర్మాణ పనులు నిలిపివేయటం దురదృష్టకరమని అన్నారు. ఇప్పుడు బిల్లులు చెల్లించలేక కాంట్రాక్టర్‌లు పనులు ఆపివేశారని తెలిసి ఎంతో బాధపడ్డానన్నారు. రాష్ట్రప్రభుత్వం మెడికల్ కళాశాల పనులు తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, దీని కోసం అందరితో కలిసి పోరాటానికి సిద్ధమన్నారు. 45 శాతం ఓటు బ్యాంక్ ఉన్న వైసీపీని ఎవరు ఏమిచేయలేరని, బాపట్ల నియోజకవర్గంలో ఎంతో బలంగా ఉన్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, కర్లపాలెం మండలపార్టీఅధ్యక్షులు యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీలు చినపోతుల హరిబాబు, యారం వనజ, మార్కెట్‌యార్డు మాజీ అధ్యక్షులు గవిని కృష్ణమూర్తి, డి.సీతారామిరెడ్డి, నారపురెడ్డి, సుబ్బారావు, రామరాజు, చింతలరాజశేఖర్, చల్లారామయ్య పాల్గొన్నారు.



వైసీపీ కార్యాలయంలో పార్టీశ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

కుచ్చెళ్లపాడులో గోమాతకు సీమంతం

వేమూరు, అక్టోబరు 13 : మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామంలో ఆదివారం ఏకాదశి పర్వదినాన భ్రమరాంబ గోశాలకు చెందిన గోమాతకు సీమంతం నిర్వహించారు. గోశాల నిర్వాహకులు మూర్తిబాబు పర్యవేక్షణలో దుర్గాదేవి మండప సన్నిధానంలో ఈ కార్యక్రమం జరిగింది. పండితుల వేదమంత్రాల నడుమ గ్రామ మహిళలు గోమాతను పసుపు, కుంకుమలు, పుష్పమాలలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. దంపతులు గోమాతకు సారే సమర్పించారు.

నిర్మాణానికి నోచుకోని పట్టణ ఆరోగ్య కేంద్రం

● ఫౌండేషన్‌తో నిలిచిపోయిన వైనం

● ముళ్ళచెట్లు పెరిగి నిరుపయోగం

బాపట్ల, అక్టోబరు 13 : పట్టణ ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు నిర్మాణం తలపెట్టిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఫౌండేషన్‌తోనే నిలిచిపోయింది. దీంతో పరిసర ప్రాంత ప్రజలు ఆకాంక్షించిన విధంగా ఆరోగ్యకేంద్రం అందుబాటులోకి రాలేదు. బాపట్లలోని ప్యాడిసన్‌పేట జగనన్నకాలనీ లేఅవుట్ వద్ద 2021వ సంవత్సరంలో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి 80 లక్షల రూపాయల అంచనా వ్యయంతో దీని నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆర్భాటంగా నిర్మాణ పనులు ప్రారంభించి బేస్‌మెంట్ వరకు నిర్మించి వదిలేశారు. సదరు కాంట్రాక్టర్‌కు బిల్లులు రానికారణంగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఈ ఆరోగ్యకేంద్రం చుట్టుపక్కల విద్యానగర్, వెంకట్రాదినగర్, నందిరాజుతోట గ్రామాలతోపాటు, జగనన్నకాలనీలోని 1800 కుటుంబాలు ఉన్నాయి. వీరందరికి ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వస్తుందని వైద్యం కోసం దూరం వెళ్ళాల్సిన పని ఉండదని ప్రజలు సంతోషించారు. అయితే గత పాలకుల నిర్లక్ష్యంతో నిర్మాణం నిలిచిపోయింది. సకాలంలో నిధులు రాక బేస్‌మెంట్ నిర్మించి వదిలేయటంతో ప్రస్తుతం దానిపై ముళ్ళచెట్లు, పొదలు పెరిగిపోయాయి. ప్రతి చిన్న వైద్య సేవల కోసం ఏరియా వైద్యశాలకు వెళ్ళాల్సిందే. ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వస్తే కొన్ని వేల కుటుంబాలకు మేలు జరిగేది. కనీసం ప్రాథమిక వైద్యసేవలు కూడా మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న ఏరియావైద్యశాలకు వచ్చి పొందాల్సి వస్తుందని ఆ ప్రాంత ప్రజలు అంటున్నారు. కూటమి ప్రభుత్వం ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు వైద్యసేవలు చేరువ చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



2021వ సంవత్సరంలో శంకుస్థాపన చేసి ఏర్పాటు చేసిన శిలాఫలకం



ఫౌండేషన్ దశలో నిలిచిపోయిన పట్టణ ఆరోగ్య కేంద్రం

ఘనంగా ముగిసిన దసరా ఉత్సవాలు

● లలితాత్రిపురసుందరిదేవిగా దర్శనం

రేపల్లె, అక్టోబరు 13 : రేపల్లె నియోజకవర్గంలో దసరా పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ పాల్గొని పూజలు నిర్వహించారు. శనివారం దసరా పండుగ సందర్భంగా 10వ రోజు లలితాదేవిగా, దుర్గాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో భక్తులు ఏర్పాటు చేసిన దసరా పందిళ్ళల్లో పూజల్లో పాల్గొని కమిటీకి ఆర్థిక సాయాన్ని అందజేశారు. పట్టణంలోని చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయం, ఆంజనేయస్వామి దేవాలయం, అరవపల్లి రోడ్డులోని రామాలయం, రామకోటి శివాలయం, నగరం మండలం కొలగానివారిపాలెంలో, రేపల్లె మండలం బేతపూడి గ్రామంలో నవరాత్రుల్లో భాగంగా దసరా పండుగ రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలచే లలితా సహస్ర నామ పారాయణం చేశారు. అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



రేపల్లెలోని బూరుగలమ్మ దేవాలయంలో దుర్గాదేవి



బేతపూడిలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి సోదరుడు శివప్రసాద్, గ్రామస్తులు

● బాపట్ల, అక్టోబరు 13 : పట్టణ, మండలంలో దసరా వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. అనేక ప్రాంతాలలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించిన నిర్వాహకులు అమ్మవారి లడ్డుకు వేలంపాట నిర్వహించి విగ్రహాన్ని భారీ ఊరేగింపుతో నిమజ్జనానికి తీసుకెళ్ళారు. సూర్యలంకరోడ్డులోని టౌన్‌హాలులో శ్రీలలిత త్రిపురసుందరి పీఠంవారు నిర్వహిస్తున్న వేడుకలలో భాగంగా అమ్మవారికి ప్రీతికరమైన చండీ సప్తశతి మంత్రపూర్వకంగా నవగ్రహ, లక్ష్మీగణపతి రుద్రసహిత చండీ హోమం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. తదుపరి లడ్డు వేలం పాట నిర్వహించగా పెనుమెత్స శివాజిరాజు రూ.23 వేలకు పాడుకున్నారు. అనంతరం వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేశారు. పీఠం నిర్వాహకులు నెమలి కంటి హనుమంతరావు, పండితులు పంగులూరి కౌండిన్యశర్మ, కేశవాచార్యులు, మల్లోలు లింగారావు, వక్కలగడ్డ బాలాజి, కొత్రా శ్రీనివాసరావు, ఉప్పాల హరికృష్ణ, పి.శివన్నారాయణ, జివిఎల్ కృష్ణసాయి, దర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు.

జనసేన ఆధ్వర్యంలో....

బాపట్ల మండలంలోని కొండుభొట్లపాలెం గ్రామంలో దసరా వేడుకలను జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. గ్రామంలోని కొండలమ్మతల్లి దేవస్థానం లో 9వ రోజు రాజరాజేశ్వరి దేవి అలంకరణలో ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, వీరమహిళలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

● కర్లపాలెం, అక్టోబరు 13 : కర్లపాలెం శ్రీరామకృష్ణ సేవాసమితిలో భక్తులచే అమ్మవారు పూజలు అందుకున్నారు. అమ్మవారిని గ్రామంలో ఊరేగింపుగావించారు. అదేవిధంగా కర్లపాలెం బంగారురెడ్డిపాలెంలో దసరా మహోత్సవాలలో భాగంగా అమ్మవారిని గ్రామపురవీధులలో భక్తులు ఊరేగింపుగావించారు.

● అమృతలూరు, అక్టోబరు 13 : మండల పరిధిలోని గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి కనక తప్పెట్లు, బాణా సంచాలతో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం అమృతలూరులో క్రొత్తపల్లి, శరణువారి రామమందిరాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారికి నిజాంపట్నం కాల్వలో నిమజ్జన కార్యక్రమం జరిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



చినపరిమిలో అమ్మవారికి సెమీవృక్షపూజ



కోటిపల్లిలో శాంతిస్వరూపిణిగా సత్యజ్ఞానప్రసూనాంబ

● భట్టిప్రోలు, కొల్లూరు, అక్టోబరు 13 : శ్రీమద్దేవి శరన్నవరాత్రులు ఆదివారంతో ముగిశాయి. మండల పరిధిలోని కోటిపల్లి శ్రీసోమశేఖరస్వామి దేవస్థానంలోని సత్యజ్ఞానప్రసూనాంబ అమ్మవారు శనివారం విజయదశమి పురస్కరించుకుని శాంతిస్వరూపిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కొల్లూరులోని అనంతభోగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా, భట్టిప్రోలులో వాసవీ అమ్మవారు పుష్పశయ్యదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

● చుండూరు, అక్టోబరు 13 : చినపరిమిలోని శ్రీగంగాపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో విజయదశమి పర్వదినం చివరిరోజు అమ్మవారిని సిద్ధి దాత్రిగా అలంకరించారు. ఈ సందర్భంగా సెమీవృక్షపూజ, ఆయుధపూజ నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. గ్రామంలో రజక వీధిలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహ ఊరేగింపులో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విగ్రహ నిమజ్జనం అనంతరం గ్రామంలో అన్నదాన సంతర్పణ నిర్వహించారు.

● వేమూరు, అక్టోబరు 13 : శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం రాత్రి నిర్వహించిన శమీ వృక్ష పూజలలో ముగిశాయి. చావలి వాలేశ్వరాలయంలో జంపని రామేశ్వరాలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిగా అలంకరించే భక్తులకు దర్శనమిచ్చారు. జంపని చెన్నకేశవాలయం రామేశ్వరాలయంలో చావ లి, పెరవలి, చదలవాడ, వరహాపురం, పెరవలి, వేమూరు గ్రా మాలలోని శివ, విష్ణు ఆలయాలలో వార్షిక శమీ వృక్షపూజలు జరిపారు.



చావలి వాలేశ్వరాలయంలో రాజరాజేశ్వరి అలంకారం

ప్రపంచ తెలుగుసాహితీ కళాజాతకు అడుసుమల్లికి ఆహ్వానం

బాపట్ల, అక్టోబరు 13 : రచయత, కవి, విశ్రాంత ట్రాన్స్‌కో ఉద్యోగి అడుసుమల్లి మల్లికార్జున్‌కు ప్రపంచ తెలుగుసాహితీకళాజాతలో పాల్గొనాలని ఆహ్వానం అందింది. ఈనెల 19, 20 తేదీలలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో 24 గంటల పాటు నిర్వహించే ప్రపంచ తెలుగు సాహిత్య కళాజాత కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానం పంపించారు. ఈ కళాజాతలో పాల్గొన్న వారి పేరు ప్రపంచ రికార్డుల పత్రంలో నమోదవుతాయని ఆయన తెలిపారు. ఆయనకు ఏపీ ట్రాన్స్‌కో రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి అలపర్తి నారాయణ స్వామి, డాక్టర్ శ్రీనివాస్, శివాజి గణేశన్ అభినందనలు తెలిపారు.



మల్లికార్జున

కత్తి పద్మారావును సన్మానించిన దళిత నాయకులు

బాపట్ల,అక్టోబరు 13 : దళిత మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కత్తిపద్మారావును దళిత సంఘాల నాయకులు ఆదివారం సన్మానించారు. బాపట్లలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను యానాది హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిరువీధుల శంకరప్రసాద్, అంబేద్కర్ రీసెర్చ్‌సెంటర్ కన్వీనర్ డాక్టర్ అడే బుజ్జి, సంఘనాయకులతో కలిసి ఆయనను ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో పుట్ల రవి, జాషువా, నళిని, వేము మాధవ్, జయపాల్, నల్ల మోతుశామ్యూల్, పులిపాటి రమేష్, మరకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కత్తి పద్మారావును సన్మానిస్తున్న శంకరప్రసాద్, బుజ్జి తదితరులు

బాలికపై వ్యక్తి అసభ్య ప్రవర్తన

కర్లపాలెం, అక్టోబరు 13 : కర్లపాలెం మండలంలోని పేరలి పంచాయతీ మేకలవారిపాలెంలో 6 సంవత్సరాల బాలిక పట్ల అదే గ్రామానికి చెందిన బాగ్యారావు శనివారం రాత్రి అసభ్యంగా ప్రవర్తించాడని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కర్లపాలెం ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. తల్లిదండ్రులు ఎవరు లేని సమయంలో బాలిక ఇంటి వద్దకెళ్ళి భాగ్యారావు అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక తల్లి ఫిర్యాదులో పేర్కొందని ఎస్‌ఐ చెప్పారు.

వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

కర్లపాలెం, అక్టోబరు 13 : కర్లపాలెం శ్రీపెద్దింటమ్మతల్లి ప్రాంగణంలో శ్రీపెద్దింటమ్మ గుడి ట్రస్ట్ సహకారంతో నిర్వహించనున్న సాయి స్వస్థ్య వెల్‌నెస్ సెంటర్ (ప్రాథమిక ఉచిత వైద్య కేంద్రం) ను ఆదివారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీపెద్దింటమ్మతల్లి కల్యాణ మండపంలో శరన్నవరాత్రులు ముగింపు సందర్భంగా అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

కనకదుర్గమ్మ విగ్రహ నిమజ్జనం

భట్టిప్రోలు, కొల్లూరు, అక్టోబరు 13 : కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహ నిమజ్జన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. భట్టిప్రోలులోని గుండి అమ్మవారి కోలాట భజన సమాజం, కాపు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి కనకదుర్గ అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రులు పూర్తి కావడంతో ఆదివారం ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం రేపల్లె మండలం పెనుమూడి వద్ద కృష్ణా నదిలో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

రహదారిపై అడ్డంగా పడిన చెట్టు



రహదారిపై పడిన చెట్టు

అమృతలూరు, అక్టోబరు 13 : తెనాలి-చందోలు ప్రధాన రహదారిలో మండూరు వంతెన సమీపంలో రహదారిపై అడ్డంగా చెట్టు పడిపోయింది. పడిపోయిన చెట్టు రహదారి సగ భాగంను ఆక్రమించింది. రోడ్డుపై చెట్టు ఉండటంతో భారీ వాహనాలు వచ్చినప్పుడు ఇబ్బందికరంగా ఉంటుందని వాహనదారులు వాపోతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు చెట్టును తొలగించాలని వాహనదారులు కోరుచున్నారు.

నేటి నుంచి పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాలు

● హాజరు కానున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, అక్టోబరు 13 : కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు సోమవారం నుంచి 20వ తేదీ వరకు నిర్వహించేందుకు అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. సోమవారం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రారంభించనున్నారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులకు ఆయా గ్రామ పంచాయితీల పరిధిలో భూమి పూజలు నిర్వహించనున్నారు. మొదటి రోజున ఉదయం 9 గంటలకు చుండూరు మండలం యడ్లపల్లి గ్రామంలో నిర్వహించే భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరవుతారన్నారు ఉదయం పది గంటలకు అమృతలూరులో, 10.30 గంటలకు వేమూరు మండలం కుచ్చెళ్లపాడులో, 11 గంటలకు వెల్లబాడు నిర్వహించే భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారు. సంక్రాంతి లోపు సంబంధిత పనులు పూర్తి చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

వరద బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ

కొల్లూరు, అక్టోబరు 13 : ఏఈఎల్‌సీ ఆధ్వర్యంలో 300 వరద బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు, దుప్పట్లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండల పరిధిలోని క్రీస్తులంకలో ఏఈఎల్‌సీ సంఘం ఆధ్వర్యంలో కార్యదర్శి చిన్నం కిషోర్ గ్రామంలోని ప్రార్థనాలయం వద్ద శనివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా నిత్యావసరాలు అందజేశారు. ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ, గత నెలలో కృష్ణానదికి వచ్చిన భారీ వరద గతంలో ఎన్నడూ చూడలేదని, వరద వల్ల లంక గ్రామాల్లోని ప్రజలందరూ సర్వం కోల్పోయారన్నారు. ప్రభుత్వం, అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తం కావడంతో ప్రాణనష్టం వాటిల్లలేదన్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి ఆదుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, ఏఈఎల్‌సీ కార్యదర్శి కిషోర్

ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రేపల్లె, అక్టోబరు 13 : దేవాలయాల అభివృద్ధిపై రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టిసారించి ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి నిధులను మంజూరు చేయించారని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. రేపల్లె మండలం పేటేరు గ్రామంలోని శ్రీబాపూజీమఠం ఆంజనేయస్వామి దేవస్థానానికి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ సీజీఎఫ్ రూ.50 లక్షల నిధులతో ఆలయ అభివృద్ధికి శనివారం శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల ముఖమండపం పునఃనిర్మాణం, దేవాలయ అభివృద్ధి, ప్రహరీ ఏర్పాటు తదితర పనులు చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి దివి వెంకట అప్పలాచారి, టీడీపీ నాయకులు గూడపాటి శ్రీనివాసరావు, గోలి శేషగిరిరావు, ధనుంజయరావు, గుర్రం మురహరిరావు, అనువంశిక అర్చకస్వామి గంగావర్జల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న శివప్రసాద్, దేవదాయ శాఖ అధికారులు

ప్రొఫెసర్ సాయిబాబా మృతి తీరని లోటు

చుండూరు, అక్టోబరు 13 : ఢిల్లీ యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతి ప్రభుత్వ హత్యగా బడుగు బలహీనవర్గాల ప్రజలు భావిస్తున్నారని కుల నిర్మూలన పోరాట కమిటీ సమితి నాయకుడు చేబ్రోలు బోడియ్య అన్నారు. ఆలపాడులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయిబాబా గతంలో అనేక దఫాలు ఆలపాడు చుట్టుపక్కల గ్రామాలలో పర్యటించారని గుర్తు చేసుకున్నారు. మొదటి నుంచి ఆదివాసి హక్కుల కోసం బడుగు, బలహీనవర్గాల ఉన్నతికి తపించారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రొఫెసర్ సాయిబాబాకి మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో అక్రమంగా జైలులో ఉంచి శారీరకంగా, మానసికంగా అంగవికలాంగుడని కూడా చూడకుండా తీవ్ర ఒత్తిడిలకు గురి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి సభ్యులు కనపర్తి సత్తయ్య, అంబేద్కర్ యూత్ నాయకులు ప్రసంగించారు.

చేపల వేటకు వెళ్ళి వ్యక్తి మృతి

రేపల్లె, అక్టోబరు 13 : చేపల వేటకు వెళ్ళి ప్రమాదవశాత్తు రేవులోపడి కొత్తపాలెం గ్రామానికి చెందిన చెన్ను నాంచారయ్య(58)మృతి చెందాడని అడవుల దీవి రైటర్ వివేక్ తెలిపారు. నిజాంపట్నం మండలం కొత్తపాలెం గ్రామంలో నాలిరేవులో చేపలవేటకు శనివారం రాత్రి వెళ్ళాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. మృతదేహం ఆదివారం ఉదయం 8గంటల సమయంలో గుర్తించారు. గ్రామస్తులు అడవులదీవి పోలీస్‌స్టేషన్‌కు విషయాన్ని తెలపటంతో రైటర్ వివేక్ వచ్చి వివరాలు అడిగి తెలుసుకుని పంచనామ నిర్వహించారు. మృతునికి భార్య, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

లారీ ఢీకొని...

బాపట్ల, అక్టోబరు 13 : రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న ఓ వ్యక్తిని లారీ ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ సీఐ ఆర్ అహ్మద్‌జానీ తెలిపిన వివరాలు ప్రకారం పెదనందిపాడు గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ జాని (70) తన అన్నకొడుకు షేక్ బాజి దగ్గర కర్లపాలెం మండల కేంద్రంలోని ఎం.వి. రాజుపాలెంలో ఆరునెలలుగా ఉంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత పెదనందిపాడు వెళ్ళేందుకు జాని నడుచుకుంటూ వస్తుండగా బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు దగ్గర వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందగా పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె, అక్టోబరు 13 : రేపల్లె మండలంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్ డీఈ శ్రీనివాసరావు తెలిపారు. రేపల్లె మండలం పేటేరు, మోర్లవారిపాలెం, గంగడిపాలెం, పోటుమెరక, బొబ్బర్లంక, పిరాట్లంక, చెన్నుపల్లెవారిపాలెం, చోడాయపాలెం, కైతేపల్లి, తుమ్మల, నిర్మలనగర్, మోళ్ళగుంట, రాజుకాల్వ, లంకెవానిదిబ్బ ఏరియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని, ఆయా గ్రామ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెదపులివర్రు పరిధిలో...

భట్టిప్రోలు, కొల్లూరు, అక్టోబరు 13 : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండల పరిధిలోని పెదపులివర్రు ఫీడర్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జి ఏఈ శాంతకుమారి ఆదివారం తెలిపారు. గొరికపూడి, కన్నెగంటివారిపాలెం, ఓలేరు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఏఈ కోరారు.



మద్యం దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ

- చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 24 షాపులకు 451
- పలువురు మహిళలూ దాఖలు

చీరాల, అక్టోబరు 13 : మద్యం దుకాణాల లైసెన్స్‌లకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. అందులో మహిళలు కూడా దరకాస్తుదారులుగా ఉండడం విశేషం. తొలుత సిండికేట్లుగా మారి ఎక్కువ దరఖాస్తులు రాలేదని, దరఖాస్తు గడవును ప్రభుత్వం రెండు రోజులు పెంచింది. ఈ క్రమంలో నిర్ణీత అంచనాలకు దగ్గరదగ్గరగా దరఖాస్తులు అందాయి. చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో చీరాల అర్బన్, చీరాల, వేటపాలెం, చిన గంజాం, కారంచేడు మండలాల పరిధిలో మొత్తం 24 మద్యం దుకాణాల లైసెన్స్‌కు దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ క్రమంలో కొన్ని దుకాణాలకు మహిళలు కూడా దరఖాస్తు చేయడం విశేషం. మొత్తం 24 దుకాణాలకుగాను 451 దరఖాస్తులు అందాయని, అందులో 41 ఆఫ్‌లైన్లో, 410 ఆన్‌లైన్‌లో అందాయని, వీటిలో మహిళల పేరుపై కూడా దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం లాటరీ పద్ధతిలో దుకాణాల లైసైన్స్‌లను ఎంపిక చేస్తారు. వెంటనే తాత్కాలిక లైసెన్స్‌ను మంజూరు చేస్తారు. 16వ తేదీ నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి వస్తుంది. నిర్ణీత నిబంధనలన్నీ పూర్తయిన తరువాత పూర్తి లైసెన్స్‌లు మంజూరు చేస్తారు. ఈ క్రమంలో తమకే తాము కోరుకున్న షాపులకు లైసెన్స్ రావాలని వారివారి ఇష్టదైవాలను దరఖాస్తుదారులు వేడుకుంటున్నారు. ఇదిలావుంటే కొందరు లాటరీ పద్ధతిలో చేతివాటం ప్రదర్శించి తమ పేర్లు వచ్చేలా ఏమన్నా మార్గం ఉందా అనే కోణంలో కూడా చర్చలు జరుపుకుంటున్నారు.

ఆ షాపు మాకే వస్తుంది.. మేమే తీసుకుంటాం

చీరాల ఎక్సైజ్ సర్కిల్ పరిదిలో ఉన్న 24 మద్యం దుకాణాలకు సంబంధించి కొన్ని దుకాణాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆ దుకాణాల్లో ప్రతి రోజు అత్యధికంగా మద్యం కొనుగోళ్లు జరుగుతాయి. దీంతో కమీషన్ ద్వారా వచ్చే ఆదాయం ఎక్కువగా ఉంటుంది. ఆ దుకాణాలను తామే తీసుకుంటామని కొందరు ముందస్తుగా ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. కొందరు అడ్వాన్స్‌లు కూడా ఇస్తున్నారు. ఆ షాపు లైసెన్స్ అడ్వాన్స్ ఇచ్చిన వారికి వస్తేసరి. లేదంటే అడ్వాన్స్ తిరిగి ఇచ్చే పనిలేదు. దీంతో అత్యధిక సేల్స్ ఉండే వాటి గిరాకీని దృష్టిలో పెట్టుకొని ఆయా దుకాణాల యజమానులు వీలైనంత ఎక్కువ మొత్తం రాబట్టుకునేందుకు ప్రయత్నిం చేస్తున్నారు. లాటరీ అనంతరం ఏ షాప్ ఎవరికి వస్తుందో తేలనుంది.

ఊరూరా అభివృద్ధి సంబరం

నేటి నుంచి పల్లె పండుగ

గ్రామీణ ప్రాంతాల్లో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పల్లె పండుగ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది. సోమవారం నుంచి ఊరూరా సంబరంలా ప్రారంభమయ్యే కార్యక్రమం వారంరోజులపాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైన్లు, ఇతరత్రా అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేయనున్నారు. అందుకోసం జిల్లాకు ప్రభుత్వం సుమారు రూ.126 కోట్లు మంజూరు చేసింది. పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించింది. డ్వామా పర్యవేక్షణలో పంచాయతీరాజ్, డ్వామా అధికారులు, సిబ్బంది ఈ పనులు చేపట్టనున్నారు.



- రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యక్రమం
- వారం రోజులపాటు భారీగా శంకుస్థానలు
- జిల్లాలో సుమారు రూ.126 కోట్ల పనులు
- సిమెంటు రోడ్లు, డ్రైన్లు అధికం
- పెట్లూరులో ప్రారంభించనున్న మంత్రి స్వామి
- ఎక్కడికక్కడ పాల్గొననున్న ప్రజాప్రతినిధులు
- సంక్రాంతి నాటికి పనుల పూర్తే లక్ష్యం

ఒంగోలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లు, ఇతరత్రా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. యంత్రాంగం గ్రామాల వారీ పనులు గుర్తించి అంచనాల తయారు చేయగా వాటిని అనుమతులు కూడా ఇచ్చింది. వీటిని సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించింది. వీటి ప్రారంభం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 14నుంచి20 వరకు వారం రోజులపాటు పల్లె పండుగ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. విధివిధానాలు, వారం రోజులపాటు కార్యక్రమ నిర్వహణ, పనుల పూర్తి తదితర అంశాలపై ఇటీవల ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మార్గదర్శకం చేశారు. సోమవారం కొండపి మండలం పెట్లూరులో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఎక్కడికక్కడ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

గ్రామ సభల్లో 31వేలకుపైగా పనుల గుర్తింపు

ఉపాది హామీ పథకం మెటీరియల్ నిధుల అనుసంధానంతో సిమెంటు, తారురోడ్లు, డ్రైన్లు ఇతర భూ, నీటి సంరక్షణ పనులు చేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. వీటి గుర్తింపు కోసం ఈ ఏడాది ఆగస్టు 23న రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు గ్రామసభలు నిర్వహించింది. అప్పుడు గుర్తించిన పనులకు అధికారులు గత నెల 2 వరకూ అంచనాలు రూపొందించారు. వాటికి కలెక్టర్ ఆమోదం తెలిపి పరిపాలనా ఉత్తర్వులు ఇచ్చారు. అలా జిల్లాలోని 729 గ్రామాల్లో సభలు నిర్వహించగా అన్ని రకాలు కలిపి సుమారు రూ.286.22 కోట్ల విలువైన 31వేలకు పైగా పనులు చేపట్టాల్సి ఉందని గుర్తించారు. అందులో దాదాపు రూ.112 కోట్ల విలువైన వెయ్యి వరకు సిమెంట్ రోడ్లు ఉన్నాయి.

ఉపాధి మెటీరియల్ నిధుల కేటాయింపు

జిల్లాలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధులు సుమారు రూ.170 కోట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో నియోజకవర్గానికి రూ.15 కోట్ల వంతున గత నెలలో కలెక్టర్ కేటాయించారు. పనులను మంజూరు చేశారు. వాటిలో రూ.126.19కోట్ల విలువైన 1,168 పనులకు పల్లెపండుగ సందర్భంగా భూమి పూజ చేయనున్నారు. అందులో సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్లు, డబ్ల్యూఎంరోడ్లు, కల్వర్టులు తదితర పనులు ఉన్నాయి. దీంతో తక్షణం ఆ పనులు చేపట్టే విధంగా క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై డ్వామా, పంచాయతీ రాజ్ అదికారులు దృష్టి సారించారు.

ప్రజాప్రతినిధులు సూచించిన వారికే పనులు

ప్రతిపాదిత పనుల్లో అత్యధికం రూ.5 లక్షల నుంచి 20 లక్షల విలువైనవి ఉన్నాయి. వీటిని ఎక్కడికక్కడ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సూచించిన వారికి కట్టబెట్టే అవకాశం ఉంది. ఎక్కువ పనులకు పల్లె పండుగలో ఎమ్మెల్యేలే నేరుగా శంకుస్థాపనలు చేసేలా వారం రోజుల షెడ్యూల్‌ను డ్వామా అధికారులు రూపొందిస్తున్నారు. వీటిని సంక్రాంతి నాటికి పూర్తి చేసి అప్పుడు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఒకేసారి భారీగా పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఇసుక, సిమెంటు, ఇతరత్రా సామగ్రి కొరత లేకుండా చూడాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు.

నేడు జిల్లాలో 170 పనులకు భూమి పూజ

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో జిల్లాలోని 57 గ్రామ పంచాయతీల్లో 170 పనులకు సోమవారం భూమి పూజ నిర్వహిస్తున్నట్లు డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పల్లె పండుగలో భాగంగా ఈ పనులను కొండపి, కనిగిరి, దర్శి, సంతనూతలపాడు, ఒంగోలు, గిద్దలూరు, ఎర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గాల్లో జిల్లాకు చెందిన మంత్రి స్వామి, శాసనసభ్యులు ప్రారంభిస్తారన్నారు.

లక్కీ లాటరీ

- నేడు మద్యం దుకాణాల కేటాయింపు
- ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో రెండు కౌంటర్లు ఏర్పాటు
- డమ్మీ విధానాన్ని పరిశీలించిన కలెక్టర్ అన్సారియా, అధికారులు

ఒంగోలు (క్రైం), అక్టోబరు 13 : మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ ప్రక్రియను సోమవారం నిర్వహించనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను ఎక్సైజ్ అధికారులు పూర్తి చేశారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 8 గంటలకు ప్రక్రియను ప్రారంభించనున్నారు. లక్కీ లాటరీ తగిలిన వారికి షాపులను కేటాయించనున్నారు. తొలుత నగరంలోని ఎన్‌జీవో హోంలో ఏర్పాట్లు చేశారు. అక్కడ ప్రైవేటు కార్యక్రమాలు ఉండటంతో వేదికను అంబేడ్కర్ భవన్‌కు మార్చారు. లాటరీ నిర్వహణ కోసం రెండు టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఆదివారం కలెక్టర్, ఎక్సైజ్ అధికారులు డమ్మీ లాటరీ తీసి పరిశీలించారు.

171 దుకాణాలకు 3,466 దరఖాస్తులు

జిల్లాలో మొత్తం 171 దుకాణాలకు నోటిఫికేషన్ ఇవ్వగా 3,466 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు ఫీజు ద్వారా రూ 69.32 కోట్ల మేర ఆదాయం లభించింది. లాటరీకి రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఒంగోలు, చీమకుర్తి, సింగరాయకొండ, పొదిలి, దర్శి సర్కిళ్లకు ఒకటో నంబర్ టేబుల్, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, కంభం, యర్రగొండపాలెం రెండో నంబర్ టేబుల్‌పై లాటరీ తీయనున్నారు. అదృష్టం వరించిన వారికి అక్కడిక్కడే దుకాణాన్ని కేటాయించనున్నారు. వీరు ఈనెల 14 నుంచి షాపును తెరిచి వ్యాపారం చేసుకోవచ్చు. మద్యం దుకాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారి అనుమతితో ఎవరినైనా లాటరీకి అనుమతిస్తారు. వారికి టోకెన్లు ఇస్తారు. కలెక్టర్‌తో కలిసి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్‌నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఏఈఎస్‌లు డి.బాలయ్య, వై.వెంకట్, ఎ.జనార్దన్‌రావు సిబ్బంది అబేద్కర్ భవన్‌లో ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు.

సింగరాయకొండ సర్కిల్‌లో ఎక్కువ దాఖలు

జిల్లాలో మొత్తం 171 మద్యం దుకాణాలకు 3,466 దరఖాస్తులు వచ్చాయి. అంటే ఒక్కో షాపుకు సగటున 27.57 దరఖాస్తులు అందాయి. సింగరాయకొండ సర్కిల్‌లో 14 దుకాణాలకు ఒక్కోదానికి సగటున 27.57 చొప్పున అత్యధికంగా 386 వచ్చాయి. అతి తక్కువగా దర్శి సర్కిల్‌లో 23 దుకాణాలకు 382 (సగటున 16.60) దాఖలయ్యాయి. ఒంగోలులో 34 దుకాణాలకు 607, గిద్దలూరులో 13 షాపులకు 232 దరఖాస్తులు అందాయి. ఈ రెండు సర్కిళ్లలోనూ ఒక్కో షాపునకు సగటున 17.85 దాఖలయ్యాయి. మార్కాపురంలో 13 దుకాణాలకు 327 (25.15), కంభంలో 10 షాపులకు 240 (సగటున 24) దరఖాస్తులు వచ్చాయి. కనిగిరి సర్కిల్ పరిధిలో 19 దుకాణాలకు 391 (20.57), చీమకుర్తి సర్కిలో 16 మద్యం దుకాణాలకు 353 (22.06) దరఖాస్తులు సమర్పించారు. పొదిలి సర్కిల్ పరిధిలో 16 దుకాణాలకు 297 (18.56), యర్రగొండపాలెంలో 13 షాపులకు 255 (20.27) దాఖలు చేశారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ ప్రక్రియ సోమవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజామొహిద్దీన్ తెలిపారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. ప్రాంగణమంతా వాటర్ ప్రూఫ్ టెంట్లు వేయించడంతోపాటు దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని లాటరీ ప్రక్రియను తిలకించేందుకు ఎల్‌ఈడీ స్ర్కీన్‌లను కూడా ఏర్పాటు చేశామన్నారు.

- ఈఎస్, ఖాజామొహిద్దీన్

అధికారుల ఆదేశాలు బేఖాతర్

- నూనె ధరలు పెంచి విక్రయం

చీరాలటౌన్, అక్టోబరు 13 : అనూహ్యంగా పెరిగిన వంట నూనెల ధరలను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు తక్కువ ధరకే అందించాలని అధికారులు కంకణం కట్టుకున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఇది అమలు జరగడం లేదు. ప్రత్యేక కౌంటర్లలో సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.125, పామాయిల్ రూ.115కు విక్రయించాలని సూచించారు. దీనిపై ఆంధ్రజ్యోతి పరిశీలించగా పట్టణంలోని మహాలక్ష్మీ ఆయిల్ అండ్ జనరల్ ట్రేడర్స్, సాయి ఆయిల్ ట్రేడర్స్ వారు రూ.125కు బదులు రూ.135కు విక్రయిస్తున్నారు. దీనిపై నిర్వాహకులను వివరణ కోరగా అధికారుల సూచనలను తోసిపుచ్చారు. గిట్టుబాటు కాని ధరలకు అమ్మకాలు చేయలేమంటూ సమర్థించుకుంటున్నారు. అధికారులు సూచించిన ధరలకు నాణ్యత లేని ఆయిల్ మాత్రమే ఇవ్వగలమని చెప్తున్నారు. అధికారులు వీటిపై దృష్టి సారించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నీటి కుంటలో పడి ఉన్న మృతదేహం (ఇన్‌సెట్లో) పులి శ్రీనివాసరావు (ఫైల్)

వ్యక్తి అనుమానాస్పద మృతి

- వేర్వేరుగా పరామర్శించిన ఎమ్మెల్యే కొండయ్య, మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం

వేటపాలెం(చీరాల)/చీరాలటౌన్, అక్టోబరు 13 : చీరాల మండలం కీర్తివారిపాలెం సమీపంలో నిర్మాణంలో ఉన్న వాడరేవు, పిడుగురాళ్ల రోడ్డు కల్వర్టు పక్కనున్న నీటి కుంటలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో ఆదివారం మృతి చెందాడు. అతడిని వేటపాలెం మండలం పాపాయిపాలెంకు చెందిన పులి శ్రీనివాసరావు(42)గా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ శేషగిరిరావు తెలిపారు. మృతిపై కుటుంబ సభ్యులు, గ్రామస్థులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం జరిగింది. కుమారుడు చదువుకుంటున్నాడు. మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యలు వేర్వేరుగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఘటనపై విచారణ జరపాలి : మాజీ ఎమ్మెల్యే

ఈ ఘటన బాధాకరమని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పోలీసులను కోరారు. కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులతో కలసి బలరాం ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

అండగా ఉంటాం : ఎమ్మెల్యే కొండయ్య

పులి శ్రీనివాసరావు మృతదేహానికి ఆదివారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అన్ని విధాలా అండగా అండగా ఉంటామని, అధైర్యపడొద్దని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిడ్డకు జన్మనిచ్చి మృత్యు ఒడిలోకి తల్లి

చీరాలటౌన్, అక్టోబరు 13 : బిడ్డ పుట్టినట్లు తల్లికి తెలియదు..తల్లి కానరాని లోకానికి చేరిందని బిడ్డకు తెలియదు.. ఈ హృదయ విదారక ఘటన వేటపాలెం మండల పరిధిలోని సర్వోదయ కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మఠం కోటేశ్వరి(30) వెంకటేశ్వర్లు దంపతులు. వీరు ఒంగోలు బాలాజీనగర్‌కు చెందిన సంచార జాతికి చెందిన వారు. ఇప్పటికే వీరికి ముగ్గురు పిల్లలు. కొంతకాలంగా వీరు వేటపాలెం మండలంలోని సర్వోదయ కాలనీలో ఉంటున్నారు. నెలల నిండిన గర్భిణి ఇంట్లో ఉండగా గత శుక్రవారం భర్త బయట పనికి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి తీవ్ర రక్తస్రావంతో భార్య మగ బిడ్డకు జన్మనిచ్చి మృతి చెందింది. దీంతో భర్త దిక్కుతోచని స్థితిలో ఉండగా సమాచారం అందుకున్న స్థానిక ఆరోగ్య సిబ్బంది వేటపాలెం పోలీసుల సహకారంతో మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అలాగే బిడ్డకు ఏరియా హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నారు. ఘటనపై వేటపాలెం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది, చైల్డ్ హెల్ప్‌లైన్ వారు సోమవారం హాస్పిటల్‌కు చేరుకుని విషయాన్ని సంయుక్తంగా పరిశీలిస్తున్నారు.



చిన్నారి

'ప్రకాశం'కు భారీ వర్ష సూచన

- రేపు, ఎల్లుండి కురిసే అవకాశం
- వాతావరణ శాఖ హెచ్చరిక
- యంత్రాంగం అప్రమత్తం
- తీరప్రాంత మండలాలకు ప్రత్యేకాధికారుల నియామకం
- కలెక్టరేట్‌లో 1077తో కంట్రోల్ రూం
- నాలుగు రోజులుగా ముసురు వాతావరణం

ఒంగోలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనాలు సోమవారం నాటికి అల్పపీడనం, ఆతర్వాత వాయుగుండంగా మారతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. వాటి ప్రభావంతో మంగళ, బుధవారాల్లో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తీర ప్రాంత మండలాల అధికారులను కలెక్టర్ అన్సారియా అలర్ట్ చేశారు. ఆయా మండలాలకు జిల్లా అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించి తక్షణ చర్యలకు ఆదేశించారు. ఆ వెంటనే రంగంలోకి దిగిన కొందరు మండలాల్లో సమావేశాలు కూడా నిర్వహించారు.

కలెక్టరేట్‌లో కంట్రోలు రూం ఏర్పాటు

జిల్లాకు భారీ వర్ష సూచన నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. దానికి టోల్‌ఫ్రీ నంబర్ 1077 కేటాయించారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య, రోడ్లు భవనాలు, విద్యుత్, వైద్యశాఖ అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలు ఈ కంట్రోలు రూంలో నిరంతరం విధులు నిర్వహించనున్నారు.



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో ఉద్యోగులు

నాలుగు రోజుల నుంచి జల్లులు

జిల్లా వార్షిక వర్షపాతంలో నాల్గోవంతుకు పైగా ఈనెలలోనే కురుస్తుంది. అలా ఈనెలలో సాధారణ వర్షపాతం 205.50 మి.మీ. కాగా ఇప్పటి వరకు 61.4 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అందులో గడిచిన నాలుగు రోజుల్లోనే సుమారు 46.0మి.మీ కురిసింది. జిల్లా అంతటా నాలుగు రోజులుగా వాతావరణం పూర్తిగా చల్లబడి తెరలు, తెరలుగా జల్లులు పడుతున్నాయి. కొన్ని చోట్ల ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఈనెల 11,12,13తేదీల్లో జిల్లాలో సగటున 36.0 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈమూడు రోజుల్లో ఒంగోలులో గరిష్ఠంగా 106.0 మి.మీ వర్షం కురిసింది. టంగుటూరులో 92.20. మద్దిపాడులో 79.0, నాగులుప్పలపాడులో 76.0. సీఎస్‌పురంలో 65.20, తర్లుపాడులో 56.2, మార్కాపురంలో 51.0, తాళ్లూరులో 50.60, చీమకుర్తిలో 50.0 మి.మీ నమోదైంది. ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, దొనకొండ, ముండ్లమూరు, పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి, హనుమంతునిపాడు, కనిగిరి, సంతనూతలపాడు, కొత్తపట్నం, జరుగుమల్లి, సింగరాయకొండ మండలాల్లో 25నుంచి 50 మి.మీ కురిసింది.

నేడు 'మీ కోసం' రద్దు

ఒంగోలులోని కలెక్టరేట్‌లో ప్రతి వారం నిర్వహించే మీ కోసం (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని ఈ సోమవారం తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో మద్యం షాపుల కేటాయింపు కోసం సోమవారం లాటరీ ప్రక్రియ నిర్వహించాల్సి ఉందన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియాతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొనాల్సి ఉన్నందున మీ కోసం కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించి దూర ప్రాంతాల నుంచి ఒంగోలు రావద్దని శ్రీలత కోరారు.

విస్తారంగా వర్షాలు

- నాగన్నవాగులో కారుతో సహా కొట్టుకుపోయిన వ్యక్తి
- రక్షించిన స్థానికులు

నాగులుప్పలపాడు అక్టోబరు 13: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉప్పుగుండూరు గ్రామీణ ఆరోగ్యకేంద్రం వద్ద నున్న నాగన్న వాగు నేలచప్టాపైకి వరద నీరు చేరింది. చప్టాకి ఇరువైపులా ఉన్న రైయిలింగ్ దిమ్మెలు సైతం నీట మునిగాయి. శనివారం బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం నీలాయిపాలెం గ్రామానికి చెందిన గుడివాడ రాజేంద్ర ఉప్పుగుండూరులో పనులు ముగించుకొని వినుకొండలో వివాహానికి వెళ్లేందుకు తన కారులో నాగన్న వాగు దాటేందుకు ప్రయత్నించాడు. అయితే వరద ఉధృతికి కారుతో సహా రాజేంద్ర వాగులో కొద్ది దూరం కొట్టుకుపోయాడు. స్థానికంగా ఉన్న ఓ మహిళ గమనించి కేకలు వేయగా చుట్టుపక్కల వారు పరుగులు తీసి తాడు సాయంతో అతి కష్టం మీద రాజేంద్రను కారులో నుంచి బయటకు తీసి రక్షించారు. అనంతరం స్థానికులే వాగుకు ఇరువైపులా ఆటోలను అడ్డుగా పెట్టి ఎవరినీ అటుగా వెళ్లకుండా పర్యవేక్షించారు. కాగా వాగులో చిక్కుకున్న కారును క్రేన్ సహాయంతో బయటకు తీసే సహాయచర్యలను తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షించి పంచనామ నమోదు చేశారు.

పొంగిన వాగులు



వాగులో కొట్టుకుపోయిన కారు

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు నాగులుప్పలపాడు-తిమ్మనపాలెం రహదారిలోని హనుమాపురం, కొత్తకోట వాగులు పొంగి ప్రవహించడంతో అటుగా రాకపోకలు నిలిచిపోయాయి. ఆ రెండు వాగుల వద్ద పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. విస్తారంగా కురిసిన వర్షాలకు మండల పరిధిలోని పలు ప్రాంతాలలో పొలాలు చెరువులను తలపించాయి.


భవనాసి చెరువు నీటిని చేపల చెరువులకు పంపింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లు


మోటార్ల ద్వారా చేపల చెరువులలోకి వస్తున్న నీరు


చెరువు నుంచి కాలువను ఏర్పాటు చేసి అక్కడ నుంచి పైపుల ద్వారా పంపుతున్న నీరు

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు దుర్వినియోగం

- చేపల చెరువులకు నీటి పంపింగ్
- వ్యవసాయ బోర్లు, భవనాసి చెరువుల నీరు యథేచ్ఛగా వాడకం
- కోళ్ల మాంసం వ్యర్థాల వినియోగంపై గ్రామస్థుల హెచ్చరిక
- తాత్కాలికంగా వెనక్కి తగ్గిన నిర్వాహకులు

అద్దంకి, అక్టోబరు 13 : ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లను చేపల చెరువుల నిర్వాహకులు దుర్వినియోగం చేస్తున్నారు. అద్దంకి మండలం శింగరకొండపాలెం సమీపంలో సుమారు 100 ఎకరాలలో చేపలు, రొయ్యల చెరువులు ఉన్నాయి. చేపలు, రొయ్యల చెరువులకు నీటిని భవనాసి చెరువు, వ్యవసాయ బోర్ల నుంచి పంపింగ్ చేస్తున్నారు. అయితే నీటి పంపింగ్‌కు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు వినియోగిస్తూ విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లే విధంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం చేపల చెరువులుగా ఉన్న ప్రాంతం గతంలో పంట భూములుగా ఉండడం, అప్పట్లో వ్యవసాయ బోర్లకు తీసుకున్న విద్యుత్ కనెక్షన్‌లను సంవత్సరాల తరబడి చేపల చెరువులకు నీటిని పంపింగ్ చేసేందుకు వినియోగిస్తున్నారు. పనిలో పనిగా మరి కొందరు నేరుగా చేపల చెరువుల వద్దనే బోర్లు వేసి, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల ద్వారా అనుమతులు పొంది వినియోగిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. దీంతో ప్రతి నెలా లక్షల రూపాయలు విద్యుత్ సంస్థకు నష్టం వాటిల్లుతున్నట్లు తెలుస్తుంది. ఇక చేపల పెంపకానికి కోళ్ల మాంసం వ్యర్థాలను కూడా వినియోగిస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతుందని, ఇటీవల శింగరకొండపాలెం గ్రామస్థులు కోళ్ల మాంసం వ్యర్థాలను తరలించే ఆటోలను అడుకొని హెచ్చిరించినట్లు తెలుస్తుంది. దీంతో తాత్కాలికంగా కోళ్ల మాంసం వ్యర్థాల వినియోగానికి బ్రేక్ పడినట్లు సమాచారం. భవనాసి చెరువు నీటిని యథేచ్ఛగా పంపింగ్ చేస్తున్నా, నీటి పంపింగ్ కు వ్యవసాయ విద్యుత్ కనెక్షలు వినియోగిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి. అదే సమయంలో చెరువుల నుంచి వచ్చే వ్యర్థాలను భవనాసి చెరువులోకి వదులుతుండడంతో భవనాసి చెరువు నీరు కూడా కలుషితమయ్యింది. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


నగదును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల విరాళం

చినగంజాం, అక్టోబరు 13 : సోపిరాల రైల్వే గేటు సెంటర్‌లో కాపు నాయకుడు వంగవీటి మోహనరంగా విగ్రహ ఏర్పాటుకు 1994-1995 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు విరాళాన్ని అందజేశారు. సోపిరాల గ్రామానికి చెందిన 1994-95 పదో తరగతి పూర్వ విద్యార్థులు మోహనరంగా విగ్రహం ఏర్పాటుకు స్థలం ఇచ్చిన అనుమాలశెట్టి బాజీకి ఆదివారం గ్రామపెద్దల సమక్షంలో రూ.2,01,150 నగదును అందజేశారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న రంగా విగ్రహానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ నెల 16న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భూమి పూజ చేయనున్నట్లు చినగంజాం గ్రామ టీడీపీ అధ్యక్షుడు చెరుకూరి రాఘవయ్య తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి పల్లె పండుగ

బల్లికురవ, అక్టోబరు 13 : అన్ని గ్రామాలలో సోమవారం నుంచి 20వ తేదీ వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాలకు కేటాయించిన రూ.3.90కోట్ల నిధులతో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణాలకు భూమి పూజ కార్యక్రమాలు జరుగుతాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాలు 14వ తేదీన వేమవరం, ఉప్పుమాగులూరు, కొప్పెరపాలెం, 15న బల్లికురవ, చెన్నుపల్లి, నక్కబొక్కలపాడు, 16న గుంటుపల్లి, పెద అంబడిపూడి, వల్లాపల్లి, 17న కొమ్మినేనివారిపాలెం, వైదన, ముక్తేశ్వరం, 18న వెలమవారిపాలెం, కొత్తూరు, కొప్పెరపాడు, 19న గొర్రెపాడు, కూకట్లపల్లి, ఎస్ఎల్ గుడిపాడు, కె.రాజుపాలెం గ్రామాల్లో జరిగే సభల్లో పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.

పంగులూరు : పంచాయతీ వారోత్సవాలలో భాగంగా ఈ నెల 14 పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.స్వరూపారాణి తెలిపారు. సోమవారం నుంచి జరిగే కార్యక్రమాల షెడ్యూల్‌ను ఆమె ప్రకటించారు. ఆయా సభలకు నోడల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఎంపీడీవో కోరారు.

అద్దంకిటౌన్ : అన్ని గ్రామాల్లో ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో డి. సింగయ్య తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో కొత్తగా మంజూరైన వివిధ పనులను ప్రారంభించడం, ఉపాధి హామీ పనులు గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు.

బస్ షెల్టర్‌కు శంకుస్థాపన

చీరాల, అక్టోబరు 13 : మసీద్ సెంటర్‌లోని స్కూల్ వద్ద బస్ షెల్టర్ నిర్మాణానికి వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ షెల్టర్ నిర్మాణానికి పూర్ణి స్కాన్ సెంటర్ వైద్యులు డాక్టర్ పేట శ్రీకాంత్ రూ.2.50 లక్షలు విరాళంగా అందజేశారన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వల్లంపట్ల వెంకటేశ్వరరావు, సుదర్శన, సత్యనారాయణ, బాలాజీ రామకృష్ణ, కౌన్సిలర్లు లలిత రాజశేఖర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం

రూ.2.10 లక్షల వ్యయంతో నిర్మాణం


బస్సు షెల్టర్‌ను ప్రారంభిస్తున్న పురోహితులు నరసింహాచార్యులు, గ్రామస్థులు

అద్దంకిటౌన్, అక్టోబరు 13 : విదేశాలలో ఉన్నా సొంత ఊరు అభివృద్ధికి తన వంతు సహకరించాలనే ఉద్దేశంతో సహకారాలను అందిస్తున్న ఎన్నారై నలజల నాగరాజు సేవలు అభినందనీయమని గ్రామ పురోహితులు నారాయణం నరసింహాచార్యులు, పలువురు గ్రామ పెద్దలు అన్నారు. అద్దంకి మేదరమెట్ల రోడ్డులోని ధేనువకొండ పునరావాస కాలనీ అయిన బలరామకృష్ణపురం వద్ద గ్రామానికి చెందిన నలజల నాగరాజు అమెరికాలో స్థిరపడ్డారు. శుభం ఫౌండేషన్ సహకారంతో ధేనువకొండ పునరావాస కాలనీ వద్ద ఆయన తండ్రి, మాజీ సర్పంచ్ నలజల వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం రూ.2.10 లక్షలతో బస్ షెల్టర్‌ను నిర్మించారు. శనివారం పురోహితులు నరసింహాచార్యులు చేతుల మీదుగా దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు తండ్రి వెంకటేశ్వర్లు గ్రామానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన విద్యార్థి ఉన్నత చదువుకు ఆర్థిక సాయాన్ని నాగరాజు తల్లి పార్వతి వర్ధనమ్మ అందించారు. ముందుగా నలజల వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగినేని రామకృష్ణ, నలజల గోపికృష్ణ, ఉపాధ్యాయుడు చప్పిడి కేశవరావు, గ్రామస్థులు నలజల శ్రీనివాసరావు, బోడపాటి వెంకయ్య, హరిబాబు, అనుబాబు, గుంజి రామాంజనేయులు, శ్రీనువాసరావు, కోటయ్య పాల్గొన్నారు.

వైభవంగా బాబా మహాసమాధి ఉత్సవం

చినగంజాం, అక్టోబరు 13 : హనుమ సాయి కుటీరంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో బాబా మహా సమాధి ఉత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి ఆధ్వర్యంలో సాయిబాబాకు అభిషేకాలు నిర్వహించి, నూతన వస్త్రాలు, పలు రకాల పూలమాలలతో విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. ఆదివారం వేకువజామున అంకిత సాయి భక్తులు సాయినాథుని చిత్రపటంతో గ్రామ పుర వీధులలో నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సమీప గ్రామాలకు చెందిన భక్తులు బాబాకు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు ధునిలో కొబ్బరి కాయలు వేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హనుమసాయి కుటీరమ్ ట్రస్టు సభ్యులు, అంకితసాయి భక్తులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముగిసిన దసరా ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి, కన్యకాపరమేశ్వరి అమ్మవారి నగరోత్సవంలో పాల్గొన్న చైర్మన్ రామకోటేశ్వరరావు

అద్దంకి, అక్టోబరు 13 : అద్దంకిలో చక్ర సహిత వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి 53వ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి జరిగిన నగరోత్సవం కనులపండువగా సాగింది. కోలాటం, కేరళ వాయిద్యాల మధ్య నగరోత్సవం సాగింది. దేవాలయం వద్ద దేవాలయం చైర్మన్ ఊటుకూరు రామకోటేశ్వరరావు దంపతులు, కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి నగరోత్సవం ప్రారంభించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యనిర్వాహక అధ్యక్షుడు చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు, అర్వపల్లి హనుమంతరావు, పోకూరి వెంకట శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. రాత్రి 8గంటలకు ప్రారంభమైన నగరోత్సవం వేకువజాము వరకు సాగింది.

శింగరకొండలో పోటెత్తిన భక్తజనం

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానానికి శనివారం భక్త జనం పోటెత్తారు. దసరా పండుగ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. వాహన పూజలు పెద్ద సంఖ్యలో జరిగాయి. అనంతరం లక్ష్మీనరశింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. మండపం వద్ద జమ్మి పూజ నిర్వహించారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి, దత్తపాదుకాక్షేత్రం, వేయి స్తంభాల ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలకరించి పూజలు నిర్వహించారు.

బల్లికురవ : దసరా నవరాత్రుల సందర్భంగా మండలంలో పలు గ్రామాలలో తొమ్మిది రోజులుగా పూజలు అందుకున్న అమ్మవారి ఉత్సవాలు శనివాంతో ముగిశాయి. గొర్రెపాడు గ్రామంలో ఉన్న అంకమ్మ తల్లి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన దసరా నవరాత్రుల పూజలు వైభవంగా జరిగాయి. విచిత్ర వేషధారణలతో గ్రామంలో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. కొత్తపాలెం గ్రామంలో మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకొంది. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నక్కబొక్కలపాడు, కొణిదెన, వేమవరం, మల్లాయపాలెం, అంబడిపూడిలో దేవాలయాలలో ప్రత్యేక పూజలు అనంతరం అన్నదాన కార్యక్రమాలను భక్తులు నిర్వహించారు.

పంగులూరు : అన్ని గ్రామాల్లో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. జమ్మిపూజ అనంతరం గ్రామాలలో దేవతామూర్తులను ఊరేగించారు. భక్తులు హారతులిచ్చి పూజలు చేశారు.

అద్భుతం పార్వేట ఉత్సవం

చీరాల : దసరా సందర్భంగా శనివారం రాత్రి ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలో పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, బాలకొండమ్మ దంపతులు జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. పేరాల మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన ఉత్సవంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, భూలక్ష్మి దంపతులు జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలతో తులతూగాలని వేడుకున్నారు. ఆలయాల వద్ద, పందిళ్ల వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు.

ఈపూరుపాలెం(చీరాలటౌన్) : చీరాల మండలం ఈపూరుపాలెం పెద్ద పందిరి వీధిలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి నిమజ్జనానికి కాళిక, గంగానమ్మ, కాంతారా వేషాలతో ఊరేగింపు నిర్వహించారు. కోలాటం అందరిని అలరించింది. భక్తులు పూజలు నిర్వహించారు.

కారంచేడు (పర్చూరు) : నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. కారంచేడులోని శ్రీ వైష్ణవీ దుర్గాలయం, పెద్దబజారు శివాలయం, మాదవస్వామి ఆలయంతోపాటు, స్వర్ణ, కుంకలమర్రు, దగ్గుబాడు, కొడవలివారిపాలెం తదితర గ్రామాల్లో విజయదశమి ఉత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఇంకొల్లు : దసరా ఉత్సవాలను వైభవంగా జరుపుకున్నారు. కృష్ణమందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరి అవతారంలో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జమ్మి చెట్టుకు పూజలు చేశారు. బస్టాండు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

మార్టూరు : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. వాసవీ అమ్మవారిని భక్తులు మహిళలు కోలాటం ప్రదర్శన చేస్తూ ఊరేగింపులో వెంట నడిచారు. శ్రీఘట్టేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి అవతారంలో భక్తులకు దర్శన మిచ్చారు. జొన్నతాళి గ్రామంలో దుర్గాదేవి అవతారంలో అమ్మవారి ఊరేగింపు ఘనంగా జరిగింది. కోలలపూడిలో నీలకంఠేశ్వరస్వామి, చెన్నకేశ్వరసామి ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్‌పై ఊరేగిస్తూ, జమ్మిచెట్టుకు పూజలు చేశారు. అనంతరం దుర్గామాతను మహిళలు బోనాలతో ఊరేగించారు.

పర్చూరు : విజయదశమి వేడుకలను మండలంలోని అయా దేవాలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పర్చూరులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగిన పూజల్లో బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఎంపీని ఆలయ కమిటీ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు ఘనంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు మామిడిపాక హరిప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ్ సుబ్బారావు, మహిళా నాయకులు ఊటుకూరి నిర్మల, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, తంగెళ్ల మల్లికార్జునరావు పాల్గొన్నారు. శ్రీ అద్దంకి నాంచారమ్మ, వేణుగోపాలస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా ముగిశాయి.

చినగంజాం : విజయదశమి పండుగను వైభవంగా నిర్వహించారు. శనివారం వేకువజామున నుంచే ఆలయాల్లో అమ్మవార్లకు పట్టు వస్త్రధారణ. పత్ర్యేక అలంకరణలు నిర్వహించి, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. కడవకుదురు గ్రామంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి విగ్రహాలను శరన్నవరాత్రులు అనంతరం గ్రామ పుర వీధులలో ఊరేగింపు నిర్వహించి మోటుపల్లి తీరంలోని గంగమ్మ ఒడికి చేర్చారు. వాసవీమాత, సోపిరాల రామకోటేశ్వరస్వామి ఆలయంలో లలితాపరమేశ్వరి ఆలయంలో శమీ పూజ నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. చినగంజాం పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ శీలం రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆయుధ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.




జమ్మి మొక్కకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య దంపతులు, పర్చూరులో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ కృష్ణప్రసాద్, మార్టూరులో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

ఉధృతంగా నాగన్న వాగు


నాగన్న వాగును పరిశీలిస్తున్న అధికారులు, సర్పంచ్

చినగంజాం, అక్టోబరు 13 : నీలాయపాలెం, ఉప్పుగుండూరు గ్రామాల మధ్య గల నాగన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పెదగంజాం, నీలాయపాలెం గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మూడు రోజులుగా ఉపరితల ఆవర్తనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు నాగన్న వాగుకు వరద రావడంతో గ్రామాలకు రాకపోకలు శనివారం నుంచి నిలిచిపోయాయి. శనివారం కురిసిన భారీ వర్షానికి నాగన్న వాగుకి ఉధృతంగా వరద రావడంతో అధికారులు పరిశీలించి, ప్రమాదాలు జరగకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. నీలాయపాలెం గ్రామ సమీపంలోని వాగు వద్ద రాకపోకలు సాగించకుండా ఇన్‌చార్జి తహసీల్దార్ యూ.శ్రీనివాసరావు, ఎస్ఐ ఎస్.రమేష్ బారికేడ్లను ఏర్పాడు చేసి, బందోబస్తు ఏర్పాటు చేశారు. నాగన్నవాగు, మట్టికుంటవాగు కలిసే రైల్వేబ్రిడ్జి నెంబరు 605 దగ్గర రైల్వే మూడవ లైను నిర్మాణ సమయంలో సిమెంట్ దిమ్మలు, మట్టిని అలాగే వదలి వేయడంతో వరద నీరు సముద్రంలోనికి వెళ్లే అవకావం లేక గ్రామాల వైపు వస్తుందని నీలాయపాలెం గ్రామ సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఇటీవల వాటిని తొలగించాలని రైల్వే అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లినా ఇంతవరకు పట్టించుకోలేదని తెలిపారు. కాలువకు అడ్డుగా ఉన్న వాటిని తొలగించకపోతే వరదల సమయంలో మరింత ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు పరిశీలించి అడ్డుగా ఉన్న వాటిని తొలగించాలని గ్రామ సర్పంచ్ కోరారు. శనివారం నుంచి రాకపోకలకు అంతరాయం కలిగినా ఆదివారం సాయంత్రానికి వరద తగ్గిపోవడంతో రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయి.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నందున మత్స్యకారులు ఎవరూ సముద్రంలో వేటకు వెళ్లొద్దని ఇన్‌చార్జి తహసీల్దార్ యూ.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దపల్లెపాలెం, పటమటి పల్లెపాలెం, బాపయ్య నగర్, తూర్పు పల్లెపాలెం గ్రామాల్లోని మత్స్యకారులతో ఆదివారం ఆయన మాట్లాడారు. అల్పపీడనం కారణంగా సోమవారం నుంచి బుధవారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాతావరణశాఖ సూచనలు పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ సూచించారు. బోట్లు, వలలు సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నా రు. గ్రామ వీఆర్వో పద్మ, మత్స్యకారులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ


పూజలు చేస్తున్న భక్తులు

అద్దంకి, అక్టోబరు13: మండలంలోని గోవాడలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, రామాలయం వద్ద ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ శనివారం వైభవంగా జరిగాయి. ఆంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటుకు రిటైర్డ్ హౌసింగ్ డీఈ పావులూరి నాగేశ్వరరావు కుటుంబసభ్యులు పూర్తి సహకారం అందించారు. ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. బంధువులతో గోవాడలోని అన్ని ఇళ్ల వద్దా సందడి కన్పించింది.

విజేతలకు బహుమతుల ప్రదానం

అద్దంకిటౌన్, అక్టోబరు 13 : జామియా సుబులుస్సలాం లిల్ బతాన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం అద్దంకిలో ముస్లిం విద్యార్థినులకు దుఆ ఆటలపోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 40 మంది విద్యార్థినులు పాల్గొన్నట్లు సభ్యులు అన్నారు. ఈ పోటీలో మొదటి బహుమతి ఆసియా, రెండవ బహుమతి నాసిహా, మూడవ బహుమతి నాజిహకు సభ్యులు అందజేశారు. మరో పది మంది పిల్లలకు నగదు బహుతులను అందజేయడంతో పాటు పాల్గొన్న పిల్లలందరికీ పుస్తకాలను ఇచ్చారు.

కడప దర్గా ఉరుసు ఉత్సవాలను జయప్రదం చేయాలి

పర్చూరు, అక్టోబరు 13 : ప్రఖ్యాతి గాంచిన కడప అమీన్ పీర్ దర్గాలో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాలని పీఠాధిపతి ఆరిఫుల్లా ముస్లింలకు పిలుపు నిచ్చారు. మాలిక్ కోరారు. అందరినీ ఆహ్వానించేందుకు ఆదివారం పర్చూరులోని షేక్ కాలేషా నివాసానికి చేరుకున్నారు. అయనతోపాటు షేక్ అహ్మద్‌బాషా, షేక్ అమానుల్లా, బుల్లా మేస్త్రీ, షేక్‌ఖాజావలి, షేక్ సలీమ్, షేక్ హుస్సేన్, షేక్ గౌస్ (ఫ్రూట్స్), నాగూర్, అమన్, అసిమ్ ఉన్నారు.

యువకునికి గాయాలు

వేటపాలెం(చీరాల), అక్టోబరు 13 : రోడ్డు ప్రమాదంలో యువకుడు గాపడ్డాడు. ఘటనా స్థలానికి చేరుకున్న వేటపాలెం ఎస్ఐ వెంకటేశ్వర్లు అతడికి ప్రథమ చికిత్సను చేసి వెంటనే ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. శనివారం రాత్రి జరిగిన ఈ ప్రమాద వివరాలివి. యువకుడు వేటపాలెం నుంచి బైక్‌పై హైవే వైపు వెళ్లే క్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. తలకు గాయమైంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని ఆ యువకునికి ప్రథమ చిక్సిత చేసి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సుబ్బయ్య (ఫైల్)

మార్టూరు, అక్టోబరు 13 : ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో వాహనాన్ని నడుపుతున్న కొప్పుల సుబ్బయ్య (48) అనే వ్యక్తి రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమై సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఈ ఘటన శనివారం రాత్రి సర్వీస్ రోడ్‌లో జరిగింది. సుబ్బయ్యతోపాటు వెనుక కూర్చున్న గారపాటి శ్రీనివాసరావుకు గాయపడగా, అతనిని గుంటూరులోని కాటూరు ఆసుపత్రికి తరలించారు. వీరు వలపర్లలోని ఎస్సీ కాలనీకి చెందినవారు. సొంత పని నిమిత్తం వారు మార్టూరు వచ్చి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సోదరుడు బుచ్చిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఆదివారం మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఏఎస్ఐ సైదా తెలిపారు.

నేడు మద్యం షాపులకు డ్రా

పర్చూరు, అక్టోబరు 13 : మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న పర్చూరు సబ్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల దరఖాస్తు దారులు సోమవారం ఉదయం 8గంటలకు హాజరు కావాలని ఎక్సైజ్ సీఐ భుజంగరావు తెలిపారు. బాపట్ల జిల్లా కేంద్రంలోని జమ్ములపాలెం రోడ్డులోని ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో డ్రా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ సమక్షంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పారదర్శకంగా డ్రా తీస్తున్నట్లు తెలిపారు. పర్చూరు ఎక్సైజ్ సబ్‌డివిజన్ పరిధిలోని పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు, యద్దనపూడి మండలాలకు సంబంధించి మొత్తం 15 మద్యం దుకాణాలకు గాను 449 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఊరేగింపులో అపశ్రుతి

ట్రాక్టర్ పైనుంచి జారిపడి బాలుడి మృతి

కావూరివారిపాలెం(చీరాలటౌన్), అక్టోబరు 13 : దసరా ఊరేగింపులో అపశ్రుతి చోటుచేసుకుంది. ఈ ఘటన చీరాల మండలం కావూరివారి పాలెం పంచాయతీ తులసీనగర్‌లో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. గ్రామానికి చెందిన పాలిబోయిన వెంకటేశ్వర్లు, జ్యోతి దంపతులకు అఖిల్(7) మరో పాప సంతానం. దసరా పండుగ సందర్భంగా గ్రామంలో శనివారం రాత్రి అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. అఖిల్‌ను ట్రాక్టర్ ఇంజన్‌పై కూర్చోబెట్టారు. నిద్ర మత్తులోకి జారుకుని ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. దీంతో వెనుక వస్తున్న డీజే వాహనం చక్రాల కింద పడి అఖిల్ తీవ్రంగా గాయపడ్డాడు. నివ్వెరపోయిన బంధువులు, కుటుంబ సభ్యులు చిన్నారిని హుటాహుటీన చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా కన్నుమూశాడు.

పగులగొట్టారు.. వదిలేశారు

- కొణిదెన - మార్టూరు ఆర్అండ్‌బీ రోడ్డులో ప్రయాణికుల అవస్థలు
- మరమ్మతుల కోసం తారు లేపి పనులు చేపట్టడంలో జాప్యం
- ఆందోళనలో వాహనచోదకులు


రోడ్డును పగులగొట్టడంతో ఏర్పడిన గుంతల్లో ఉన్న నీరు

బల్లికురవ, అక్టోబరు 13 : రోడ్డు మరమ్మతులు చేస్తున్నారని అందరూ ఆనందపడ్డారు. అయినా ప్ర యాణికులకు నిరాశే మిగిలింది. నెల రోజుల కిందట బల్లికురవ, కొణిదెన, మార్టూరు రోడ్డు మర్మత్తులు చేపట్టేందుకు ఉన్న తారు రోడ్డును పూర్తిగా పగలగొట్టారు. మరమ్మతు పనుల్లో మాత్రం తీవ్ర జాప్యం చేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి అధ్వానంగా ఉన్న కొణిదెన - మార్టూరు రోడ్డును బాగు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ పనులను దక్కించుకొని పనులు మెదలు పెట్టారు. రోడ్డును పగులగొట్టి నెలలు అవుతున్నా పనులు పూర్తి చేయలేదు. దీంతో ఈ రోడ్డున రాకపోకలు సాగించే ప్రయాణికులు నరకం చూస్తున్నారు. తారు రోడ్డు పెచ్చులు లేపి మార్జిన్‌లో పడవేయడంతో మట్టి రోడ్డుగా మారింది. వర్షం కురిస్తే ఈ రోడ్డు వాగులను తలపిస్తుందని వాహన చోదకులు వాపోతున్నారు. ఈ రోడ్డు పనులు పూర్తి అవుతాయని అనుకున్నామని కానీ పనులు మాత్రం మెదలు కాలేదని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న వానకే గోతులలో ఉన్న నీటిలో ప్రమాదాలు జరుతున్నాయని వారు తెలిపారు. సంబంధిత అధికారులు కొణిదెన రోడ్డు మరమ్మతు పనులు పూర్తికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వారం రోజుల్లో పనులు మొదలవుతాయి :బాబ్జీ, అర్అండ్‌బీ జేఈ

బల్లికురవ - కొణిదెన - మార్టూరు రోడ్డుకు నిధులు మంజురయ్యాయి. ఈ నిధులతో కొణిదెన - మార్టూరు మధ్య పూర్తిగా దెబ్బతిన్న చోట రోడ్డు మరమ్మతులు చేసేందుకు కాంట్రాక్టర్ పగులగొట్టారు. వారం రోజుల్లో ఈ రోడ్డు పనులు మొదలు పెట్టేలా చర్యలు చేపడతాం.